**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 28, పేజీలు - 08

శుక్రవారం, జులై 24, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## తప్పుడు ఫిర్యాదు చేస్తే

# లోపల వేయిస్తా

- ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ డిమాండ్ చేయడం లేదని విమర్శ
- నాకు రెండు ఓట్లు లేవని స్పష్టం చేసిన సీఎం రేవంత్
- గ్లోబరినా సంస్థ తప్పిదాల వల్ల పిల్లలు ఆత్మహత్యలు చేసుకున్నారని విమర్శ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తనకు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయంటూ వస్తున్న ఆరోపణలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన, తనపై వస్తున్న ఆరోపణలపై దమ్ముంటే ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. ఒకవేళ అది తప్పుడు ఫిర్యాదు అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన ఓటు బదిలీ కోసం నిబంధనల ప్రకారం ఇప్పటికే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓట్లను తొలగించారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్‌పై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఓటర్ల జాబితా సవరణ పూర్తయిందని, ప్రక్షాళన నెపంతో ఓట్లు గల్లంతు కాకుండా ఉండేందుకు బీఎల్ఓలను నియమించినట్లు వివరించారు. ఓట్లు లేకపోతే ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు. హైడ్రా పనితీరుపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. ఈ సంస్థ ఇప్పటికే అనేక అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా గాలికొదిలేశారని

2లో..

## విద్యార్థులు ఒంటరి కాదు..

# వారికి అండగా ఉంటాం

- స్పష్టం చేసిన రాహుల్ గాంధీ




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంపై దేశ రాజధానిలో ఆందోళనలు చేపట్టిన విద్యార్థులకు పూర్తి స్థాయిలో ప్రతిపక్ష ఇండియా కూటమి మద్దతు ప్రకటించింది. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇండియా కూటమి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిని మరింత పెంచింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని ప్రధాన ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మరోసారి డిమాండ్ చేశారు. విద్యార్థులు ఒంటరి కాదని అండగా ఉంటామని స్పష్టం చేశారు.

2లో..

# చేనేతలకు నేతన్న భరోసా

## - ఏపీ కేబినెట్ సంచలన నిర్ణయాలు

- 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశంపై అధ్యయనానికి ఉపసంఘం
- నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ. 641 కోట్ల పరిపాలనా అనుమతి
- పుష్కరాల నిర్వహణ, బందోబస్తు కోసం రూ. 50 కోట్లు విడుదల






అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అనేక కీలక, నిర్ణయాలకు ఆమోదముద్ర పడింది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా దాదాపు 25కు పైగా అజెండా అంశాలపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చలు జరిగాయి. సుమారు మూడు గంటల పాటు సాగిన ఈ భేటీలో యువత, చేనేత కార్మికులు, దివ్యాంగులు, వ్యవసాయ రంగానికి లబ్ధి చేకూర్చే పరిపాలనాపరమైన అనుమతులకు గ్రీన్ సిగ్నల్ లభించింది.

2లో..

## సీఎం రేవంత్‌రెడ్డికి లీగల్ నోటీసు

# పంపిన కేటీఆర్

## - క్షమాపణ చెప్పాలని లేదంటే రుజువు చేయాలని డిమాండ్

- గ్లోబరీనాతో తమకు సంబంధం లేదన్న కేటీఆర్
- సీఎం ఆరోపణలు పూర్తిగా అసత్యమని వ్యాఖ్య
- ఆరోపణలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్
- లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్లోబరీనా తన బినామీ సంస్థ అంటూ వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి లీగల్ నోటీసులు పంపినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. రేవంత్ రెడ్డి సమాధానం ఇవ్వకపోతే న్యాయపరంగా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. గ్లోబరీనా సంస్థపై తనపై సీబీఐ, సీఐడీ, ఎఫ్బీఐతో విచారణ చేయిస్తే తాను సంపూర్ణంగా సహకరిస్తానని సంస్థ తనదేనని నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. లేదంటే సీఎంకు తనకు లైడిటెక్టర్ కూడా సిద్ధమేనన్నారు. ఒకవేళ సంస్థ తనదే అయితే మరి రేవంత్

2లో..

## క్వాంటం పరిశోధనలకు

# అమరావతి బెస్ట్ ప్లేస్

## - క్వాంటినమ్ సీఈఓతో సీఎం చంద్రబాబు భేటీ



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని క్వాంటం కంప్యూటింగ్ రంగంలో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా, ముఖ్యమంత్రి చంద్రబాబుతో అంతర్జాతీయ ఫుల్ స్టాక్ క్వాంటం కంప్యూటింగ్ సంస్థ 'క్వాంటినమ్' సీఈఓ రాజీబ్ హజ్రా, ఇతర ప్రతినిధులు సచివాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. క్వాంటం పరిశోధనలకు, ఆవిష్కరణలకు అమరావతి అత్యుత్తమ ప్రదేశమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్ టెక్నాలజీలను అందిపుచ్చుకోవడంలో భాగంగా అమరావతిలో 'క్వాంటం వ్యాలీ'ని ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం కార్యకలాపాలు ప్రారంభిస్తుందని, ఇప్పటికే రాష్ట్రంలో క్వాంటం టెస్టింగ్ ఫెసిలిటీలు పనిచేస్తున్నాయని వెల్లడించారు. గతంలో ఐటీని ప్రోత్సహించామని, ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీలతో సమస్యలకు వేగంగా పరిష్కారాలు అందించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. జాతీయ క్వాంటం మిషన్‌కు అనుగుణంగా, ప్రపంచస్థాయి ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు ఏపీతో వ్యూహాత్మక భాగస్వామ్యంపై క్వాంటినమ్ సంస్థ తీవ్ర ఆసక్తి వ్యక్తం చేసింది. క్వాంటం నైపుణ్యాభివృద్ధి, ఏఐ ఆధారిత క్వాంటం అప్లికేషన్లు, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రీసెర్చ్, స్టార్టప్ ఇంక్యుబేషన్ వంటి రంగాల్లో కలిసి పనిచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఏపీలో క్వాంటం కంప్యూటర్ పరికరాల తయారీ నుంచి అల్గారిథమ్‌ల అభివృద్ధి వరకు పూర్తిస్థాయిలో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని క్వాంటినమ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో క్వాంటినమ్ సంస్థ ఉపాధ్యక్షుడు సీతారామకృష్ణ, అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పావురాలపై ప్రేమ.. ప్రాణాలకే ప్రమాదమా.?

- పావురాల మేత నియంత్రణపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు
- 3 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- ప్రజా ఆరోగ్యం, పర్యావరణానికి పావురాల వ్యర్థాలతో ముప్పు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్, సికింద్రాబాద్ నగర పరిధిలో విచ్చలవిడిగా పావురాలకు మేత వేయటంపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పావురాల మేతను నియంత్రించడానికి, వాటి సంతతి పెరుగుదలను అరికట్టడానికి తీసుకున్న చర్యలపై మూడు వారాల్లోగా పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు రాధేశ్యామ్ తపాడియా దాఖలు చేసిన ప్రజాహిత పిటిషన్ పై ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.

2లో..

## లీవ్ తీసుకున్నందుకు ఉద్యోగం నుంచి తొలగింపు

- టెక్ మహీంద్రాపై మహిళా టెకీ ఫిర్యాదు



హైదరాబాద్‌లోని ప్రముఖ ఐటీ సంస్థ టెక్ మహీంద్రాపై మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చేసిన ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. భావన అనే మహిళా ఉద్యోగిని అనారోగ్య కారణాలతో పాటు తన

2లో..

## పేదల సంక్షేమాన్ని అడ్డుకునే

# రాజకీయాలను తిప్పికొట్టాలి

- పేదలకు ఇళ్లు కడితే.. ఎందుకంత కడుపుమంట? - పొంగులేటి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో కోట్ల రూపాలయ విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు గృహాలు నిర్మించనున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇండ్ల కేటాయింపులో బడుగు, బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్టుగా వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో సొంత ఇల్లు లేని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు గౌరవప్రదమైన గృహాలను అందుబాటు ధరలో అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని చెప్పారు. హైదరాబాద్

2లో..

# డీఆర్‌డీఓ మరో ఘనత

- 'కుశ' క్షిపణి ప్రయోగం విజయవంతం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సుదూర లక్ష్యాలను ఛేదించగల 'కుశ' క్షిపణి తొలి ప్రయోగాన్ని గురువారం విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఈ పరీక్షను చేపట్టినట్లు డీఆర్‌డీఓ వర్గాలు వెల్లడించాయి. గగనతలంలో అత్యంత వేగంగా, ఎత్తులో ప్రయాణించే ఎలక్ట్రానిక్ లక్ష్యాన్ని అనుకరించి ఈ పరీక్ష నిర్వహించగా, 'కుశ' క్షిపణి దానిని విజయవంతంగా అడ్డగించిందని

2లో..

## నేడు దేశవ్యాప్తంగా

# ఆందోళనలు

- కాక్రోచ్ జనతా పార్టీ సంచలన పిలుపు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నీట్ సహా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పేపర్ లీక్స్, ఇతర అక్రమాలకు నిరసనగా ఢిల్లీ జంతర్ మంతర్ లో కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ తాజాగా పార్లమెంట్ మార్చ్ నిర్వహణకు ప్రయత్నించింది. దీంతో ఢిల్లీ పోలీసులు విద్యార్థులపై భారీ ఎత్తున దాడులు చేసి నిలువరించారు.

2లో..

# తప్పుడు ఫిర్యాదు చేస్తే లోపల వేయిస్తా

విమర్శించారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి కారణంగానే కేసీఆర్ గతంలో హరీశ్ రావును కొంతకాలం మంత్రి పదవికి దూరంగా ఉంచారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటర్మీడియట్ ఫలితాల వెల్లడిలో జరిగిన తప్పిదాల వల్ల 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో కేటీఆర్ తన నిజాయతీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలకు కారణమైన కేటీఆర్, ఇప్పటికైనా బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ఆయన నిలదీశారు.

## విద్యార్థులు ఒంటరి కాదు..

# వారికి అండగా ఉంటాం

అంతకుముందు రాహుల్ గాంధీ నివాసంలో కాంగ్రెస్ ఎంపీలు అత్యవసరంగా సమావేశం అయ్యారు. నీట్ పేపర్ లీకేజీ అంశంలో తదుపరి కార్యాచరణపై చర్చలు జరిపారు. విద్యార్థుల నిరసనలు, తాజా పరిణామాలపై చర్చించారు. పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహంపై రాహుల్ గాంధీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఆ తర్వాత విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు అలాగే ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నివాళులర్పించేందుకు రాహుల్ గాంధీతో పాటు ఎంపీలంతా గాంధీ స్మృతివనం వద్దకు బస్సులో బయల్దేరారు. కానీ మార్గమధ్యంలోనే బస్సును పోలీసులు ఆపివేశారు. దాంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఈ అంశంపై రాహుల్ గాంధీ మాట్లాడుతూ మొదట ఇండియా గేట్ వద్దకు వెళ్లాలని భావిస్తే పోలీసులు అనుమతి నిరాకరించారని పేర్కొన్నారు. తర్వాత గాంధీ స్మృతికి వెళ్లాలని చెప్పినా తమ బస్సును అడ్డుకున్నారని మండిపడ్డారు. కానీ తమ సందేశం ఒక్కటే విద్యార్థులారా తామంతా మీతోనే ఉన్నాం అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఇక విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నివాసంతోపాటు కేంద్రమంత్రుల ఇళ్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు అధికారులు. ఇదిలాఉంటే విద్యార్థులు ఆందోళనలు చేపడుతున్న జంతర్ మంతర్ వద్ద మొబైల్, ఇంటర్నెట్ సేవలను బంద్ చేశారు పోలీసులు. జంతర్ మంతర్ నుంచి 1.5 కిలోమీటర్ల వరకూ మొబైల్, ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేశారు. అర్ధ రాత్రి 12 గంటల వరకు ఆ ఆంక్షలు అమలులో ఉంటాయని పోలీసులు స్పష్టం చేశారు. ఇక కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలనే డిమాండ్ తో శుక్రవారం దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చింది.

# సీఎం రేవంత్రెడ్డికి లీగల్ నోటీసు పంపిన కేటీఆర్

సర్కారు గ్లోబరీనాతో ఎందుకు ఒప్పందం చేసుకుందో చెప్పాలని డిమాండ్ చేశారు. హన్మకొండలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన కేటీఆర్ మీడియా ప్రతినిధులతో చిట్ చాట్లో పలు అంశాలపై మాట్లాడారు.

### బీజేపీ పతనానికి నాంది

దేశ రాజధానిలో యువత చేస్తున్న ఉద్యమం తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేస్తుందని కేటీఆర్ తెలిపారు. నాయకుడు లేకుండానే యువత స్ఫూర్తివంతమైన ఉద్యమం చేస్తుందన్నారు. ఢిల్లీ ఉద్యమంతో మోదీ ప్రభుత్వం అతిపెద్ద సవాల్ ఎదుర్కొంటోందన్న కేటీఆర్ బీజేపీ ప్రభుత్వం ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే పెట్టుకుందని తెలిపారు. మోదీపై యువత తీవ్ర వ్యతిరేకత, అసహనంతో ఉన్నారని అన్నారు. బీజేపీ పతనానికి నాంది పడిందని మోదీని దేవుడు అన్నోళ్లే తిరుగుబాటు చేస్తున్నారని అభిప్రాయపడ్డారు.

### పగలు కాంగ్రెస్, రాత్రి బీజేపీతో సీఎం రేవంత్రెడ్డి

దేశంలోనే దిక్కు లేకుండా పోయేపరిస్థితి బీజేపీకి ఎదురవుతోందని, ఇక తెలంగాణలో అధికారంలోకి వచ్చే పరిస్థితి ఎక్కడుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మోదీపై మాట్లాడే దమ్ము ఎక్కడుందని నిలదీశారు. తోటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఢిల్లీ వెళ్లి మోదీ ఇంటిముందు ధర్నా చేస్తే రేవంత్ రెడ్డి కనీసం రాజ్ భవన్ ముందు కూడా ఆందోళన చేయకుండా కొడంగల్లో చేశారని విమర్శించారు. రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్ తో రాత్రి బీజేపీతో ఉంటాడని, బీజేపీ ఎంపీల కార్లలో వెళ్లి రేవంత్ రెడ్డి అమిత్ షాతో సమావేశాల్లో పాల్గొంటున్నాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ కాంగ్రెస్కి ఒక మూట ఇస్తే బీజేపీకి రెండు మూటలు పంపుతున్నాడని విమర్శించారు.

### ఏ పార్టీతో పొత్తు ఉండదు

వచ్చే ఏడాది తన పాదయాత్ర ఉంటుందన్న కేటీఆర్ ఏ పార్టీతోనూ పొత్తు ఉండబోదని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్ను సీఎం చేయడమే తన ఎజెండా అన్నారు. సీఎం పదవి వారసత్వ హక్కు కాదని, తనకు ఎలాంటి భ్రమలు లేవన్నారు. ఈ సారి రైతులు, యువత, మహిళలను తమవైపు ఆకర్షించేలా పార్టీ కార్యాచరణ ఉంటుందని ఆగస్టు 10 తర్వాత పార్టీ సంస్థాగత బలోపేతం చేపడతామన్నారు.

# చేనేతలకు నేతన్న భరోసా



### 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

ఈ సమావేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన నిర్ణయం నిరుద్యోగులకు సంబంధించింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 3,168 ప్రభుత్వ ఉద్యోగాలను ఏపీపీఎస్సీ , ఇతర రిక్రూట్మెంట్ బోర్డుల ద్వారా భర్తీ చేసే ప్రతిపాదనకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. దీంతో నోటిఫికేషన్ల విడుదలకు మార్గం సుగమమైంది. దీనితో పాటు చేనేత కార్మికుల ఆర్థిక సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నేతన్న భరోసా పథకం కింద అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి ఏటా 25,000 చొప్పున ఆర్థిక సాయం అందించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయం పట్ల మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

### గోదావరి పుష్కరాల బందోబస్తు ఏర్పాట్లకు నిధులు

రాష్ట్రంలో మౌలిక వసతులు, మౌలిక ప్రాజెక్టుల పురోగతిపై కేబినెట్ లోతుగా చర్చించింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనుల వేగం, ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అలాగే రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, సురక్షితంగా నిర్వహించేందుకు భద్రత, బందోబస్తు ఏర్పాట్ల కోసం 50 కోట్ల నిధులను మంజూరు చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనితో పాటు రైతాంగానికి మద్దతుగా ఏపీ మార్క్ఫెడ్ సేకరించే 300 కోట్ల రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలని నిశ్చయించింది.

### వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు ప్రత్యేక డిగ్రీకాలేజీ

సామాజిక బాధ్యత , దివ్యాంగుల సంక్షేమంలో భాగంగా కేబినెట్ మరో అరుదైన నిర్ణయం తీసుకుంది. బాపట్లలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల ఉన్నత విద్య కోసం ప్రత్యేకంగా ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే అత్యవసర సేవల సమర్థతను పెంచేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించి అగ్నిమాపక శాఖకు నూతన వాహనాలు, ఆధునిక యంత్ర పరికరాలు సమకూర్చాలని తీర్మానించారు. విశాఖపట్నంలో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఎండాడ వద్ద ఏఐజీ ఆసుపత్రులకు భూ కేటాయింపు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపిందని సమాచారం.

### రైతులకు సాగునీటి కొరత లేకుండా చర్యలు

మరోవైపు రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులపైనా కేబినెట్లో చర్చ జరిగింది. ఎల్ నినో ప్రభావం వల్ల ఎదురవుతున్న దుర్భిక్ష పరిణామాలను గమనిస్తూ, రైతులకు సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక అభివృద్ధి, నూతన పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూలమైన విధానాలను వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. పొగాకు రైతులకుసాయం చేయడానికి మూడు అంశాలపై మంత్రుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

# పావురాలపై ప్రేమ.. ప్రాణాలకే ప్రమాదమా.?

మొహియుద్దీన్లతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది దీపక్ మిశ్రా కోర్టుకు తన వాదనలు వినిపిస్తూ.. నివాస ప్రాంతాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, రద్దీగా ఉండే పబ్లిక్ ప్రాంతాలు, చారిత్రక వారసత్వ కట్టడాల సమీపంలో ఎలాంటి నిబంధనలు లేకుండా పావురాలకు మేత వేస్తున్నారని తెలిపారు. దీనివల్ల నగరంలో పావురాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయాని ఆందోళన వ్యక్తం చేశారు. పావురాల మేతను నియంత్రించడంలో, ఆరోగ్యం, పర్యావరణ ముప్పులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పిటిషనర్ వాదించారు. అధికారుల తీరు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 ద్వారా పౌరులకు సంక్రమించిన జీవించే హక్కును కాలరాసేలా ఉందని ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అనుమతి లేని ప్రదేశాల్లో మేత వేసే వారికి కఠిన జరిమానాలు విధించడం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పావురాల సంఖ్యను నియంత్రించడానికి మానవీయ, పర్యావరణ రహిత సమతుల్య పద్ధతులను అవలంబించేలా ఆదేశించాలని పిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై తదుపరి విచారణను ఆగస్టు 25వ తేదీకి వాయిదా వేసింది.

### పావురాల అంత ప్రమాదకరమా.?

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పావురాల మేతపై చర్చ మొదలైంది. అవి అంత ప్రమాదకరమా.? అని ప్రజలు చర్చించుకున్నాయి. అయితే అది నిజమేనని అంటున్నారు వైద్య నిపుణులు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం నగరాల్లో ఆహారం సులభంగా దొరకడం వల్ల పావురాల సంఖ్య నియంత్రణ లేకుండా పెరిగి ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది. ఆహార వ్యర్థాలు నేలపై పడి కుళ్ళిపోవడంతో పాటు పావురాల రెట్టలు భవనాలను దెబ్బతీస్తూ గాలిలో కలిసే ప్రమాదకర క్రిములకు నిలయంగా మారుతున్నాయి. పావురాల ఈకలు, ఎండిపోయిన రెట్టల నుంచి వచ్చే ధూళి గాలిలో కలవడం వల్ల మానవులకు తీవ్రమైన శ్వాసకోశ, ఊపిరితిత్తుల వ్యాధులు సంభవిస్తున్నాయట. ముఖ్యంగా పావురాల సావాసం వల్ల హైపర్ సెన్సిటివిటీ న్యూమోనైటిస్ అనే అలెర్జీ వచ్చి అది కాలక్రమేణా ఊపిరితిత్తులను శాశ్వతంగా దెబ్బతీసే లంగ్ ఫైబ్రోసిస్కు దారితీస్తుందని చెబుతున్నారు. అలాగే వీటి ద్వారా వ్యాపించే సిట్టకోసిస్ అనే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల తీవ్రమైన జ్వరం, ఛాతీ నొప్పి, న్యుమోనియా వంటి సమస్యలు వస్తాయట. వీటి రెట్టలలో పెరిగే ఫంగస్ కారణంగా హిస్టోప్లాస్మోసిస్, క్రిప్టోకోకోసిస్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చి ఊపిరితిత్తులతో పాటు నరాల వ్యవస్థ, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతాయని అంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా బాధితులకు ఈ ధూళి వల్ల శ్వాసకోశ అలెర్జీలు మరింత ఎక్కువవుతాయని చెబుతున్నారు.

# లీవ్ తీసుకున్నందుకు ఉద్యోగం నుంచి తొలగింపు

చిన్నారి ఆరోగ్య సమస్యల కారణంగా సెలవులు తీసుకున్నందుకు అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించారని ఆరోపించింది. ఈ క్రమంలోనే తనను ఉద్యోగం నుంచి తీసేసినందుకు దుండిగల్ పోలీసులను ఆశ్రయించి కంపెనీపై ఫిర్యాదు చేసింది. అంతటితో ఊరుకోని ఆ మహిళా టెకీ సోషల్ మీడియా వేదికగా తన గోడు వెళ్లబోసుకుంది. ఆ తర్వాత టెక్ మహీంద్రా కంపెనీ ఆఫీస్ ఎదుట ధర్నాకు దిగుతూ తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత టెకీ భావన వెల్లడించిన వివరాల ప్రకారం ఆరోగ్య సమస్యల కారణంగా ముందుగానే సెలవు కోరుతూ మెడికల్ రిపోర్టులు సమర్పించినప్పటికీ టెక్ మహీంద్రా యాజమాన్యం తన పరిస్థితిని పరిగణనలోకి తీసుకోలేదని చెప్పింది. రెస్ట్ అవసరమైన సమయంలో కూడా కంపెనీ నుంచి వరుసగా ఈ-మెయిల్స్, ఫోన్ కాల్స్ చేస్తూ వెంటనే విధుల్లో చేరాలని ఒత్తిడి తీసుకొచ్చారని ఆమె సంచలన ఆరోపణలు చేసింది. ఆ తర్వాత తన కుమార్తె అనారోగ్యానికి గురి కాగా మరోసారి 3 రోజుల సెలవు కోరగా ఎలాంటి సానుభూతి చూపకుండా చివరికి ఉద్యోగం నుంచి తొలగించారని పేర్కొంది. టెక్ మహీంద్రా కంపెనీలో అమలు చేస్తున్న పని విధానాలపైనా భావన తీవ్ర విమర్శలు చేశారు. వాష్రూమ్కు వెళ్లాలన్నా ముందుగా అనుమతి తీసుకోవాల్సి వచ్చేదని మహిళా ఉద్యోగుల పట్ల కనీస గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తన వృత్తి జీవితంలో ఇంత కఠినమైన వర్క్ కల్చర్ను ఎప్పుడూ చూడలేదని తెలిపారు. 60 రోజుల నోటీస్ పీరియడ్ ఇవ్వకుండా నేరుగా టెర్మినేషన్ లెటర్ జారీ చేశారని కూడా ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని దుండిగల్ పోలీసులకు భావన విజ్ఞప్తి చేసింది. మహిళా ఉద్యోగుల వ్యక్తిగత, కుటుంబ పరిస్థితులను కార్పొరేట్ సంస్థలు గౌరవించాలని కోరారు. అయితే భావన చేసిన ఆరోపణలపై టెక్ మహీంద్ర సంస్థ ఇప్పటి

# నేడు దేశవ్యాప్తంగా ఆందోళనలు

ఈ దాడుల్లో భారీ ఎత్తున విద్యార్థులు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసుల దమనకాండను నిరసిస్తూ నేడు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చింది. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల చర్యకు నిరసనగా నేడు దేశవ్యాప్త శాంతియుత నిరసనకు పిలుపునిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. నీట్ ఆందోళన సందర్భంగా విద్యార్థులపై పోలీసులు క్రూరంగా ప్రవర్తించారని ఆరోపిస్తున్న సీజేపీ ఇందుకు నిరసనగా దేశంలోని ప్రతి జిల్లాలో ప్రదర్శనలు నిర్వహించాలని కోరింది. అయితే ఈ నిరసన శాంతియుతంగానే చేయాలని విద్యార్థుల్ని కోరింది. విద్యార్థి సంఘాలు, ఇతర సంస్థలు స్థానికంగా సమన్వయం చేసుకోవాలని, విద్యార్థుల డిమాండ్లను బహిరంగంగా చదివి వినిపించాలని, పోలీసుల చర్య వల్ల ప్రభావితమైన వారికి సంఘీభావం తెలపాలని కాక్రోచ్ పార్టీ కోరింది. ఢిల్లీలో చేపడుతున్న నిరసనలపై కేంద్రం ఇప్పటివరకూ స్పందించకపోవడం, మరోవైపు పోలీసులు కేసులు, నిర్బంధాలతో ఇబ్బంది పెడుతున్న తరుణంలో దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునివ్వడం ద్వారా కేంద్రంపై మరింత ఒత్తిడి పెంచాలని కాక్రోచ్ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ ఉద్యమానికి ఇప్పటికే దాదాపు అన్ని విపక్ష పార్టీలు జంతర్ మంతర్ కు వచ్చి మరీ మద్దతు ప్రకటించాయి. వీరంతా నేడు విద్యార్దులు చేపట్టే ఆందోళనల్లో పాల్గొనే అవకాశం ఉంది. కేంద్రం పార్లమెంట్ లో నీట్ పేపర్ లీక్ పై చర్చకు సిద్దమని ప్రకటించినా, విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు అంగీకరించకపోవడంతో ఇప్పటికే ఉభయసభల్లో కార్యకలాపాలు ముందుకు సాగడం లేదు.

# డీఆర్డీఓ మరో ఘనత

డీఆర్డీఓ ఒక ప్రకటనలో తెలిపింది. యుద్ధ విమానాలు, క్షిపణులు, మానవరహిత వైమానిక వాహనాలు , శత్రువులకు చెందిన భారీ విమానాలను కూడా సుదూరంలోనే నాశనం చేయగల సత్తా ఈ క్షిపణి వ్యవస్థకు ఉంది. 'ప్రాజెక్ట్ కుశ'లో భాగంగా భారత వాయుసేన, నౌకాదళం కోసం ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 80 కిలోమీటర్ల రేంజ్ ఎంఆర్-శామ్, 400 కిలోమీటర్ల రేంజ్ ఎస్-400 వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని 'కుశ' భర్తీ చేయనుంది. ఇప్పటికే వాయు రక్షణ వ్యవస్థలో ఉన్న బరాక్-8, ఎస్-400, ఆకాశ్ క్షిపణులకు ఇది అదనపు బలంగా నిలవనుంది. 'కుశ' క్షిపణి విజయవంతం కావడం భారత రక్షణ పరిశోధన రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ అన్నారు. ఇలాంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయగల సామర్థ్యం కేవలం కొన్ని దేశాలకే ఉందని గుర్తుచేశారు. ఈ విజయంతో ఇలాంటి వ్యవస్థల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుందని, ఇది దేశ వాయు రక్షణ సామర్థ్యంలో ఒక పెద్ద ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ క్షిపణికి సంబంధించిన రాడార్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సహా అన్ని భాగాలను డీఆర్డీఓ, దేశీయ పరిశ్రమలు కలిసి అభివృద్ధి చేశాయి. రక్షణ శాఖ కార్యదర్శి, డీఆర్డీఓ ఛైర్మన్ రాజేష్ కుమార్ సింగ్ ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించి, శాస్త్రవేత్తల బృందాన్ని అభినందించారు.

# భూసేకరణ పనులు వేగవంతంగా చేపట్టాలి

**కరీంనగర్** జిల్లాలో చేపట్టిన కీలక సాగునీటి, రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా రెవెన్యూ, ఇరిగేషన్తో పాటు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలని స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో రెవెన్యూ, ఇరిగేషన్, భూ సేకరణ విభాగం, నేషనల్ హైవేస్ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమీక్షలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, మిడ్ మానేరు, గౌరవెల్లి రిజర్వాయర్ కాలువలు, కాకతీయ కాలువ, కాళేశ్వరం ప్రాజెక్టు, కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ కరీంనగర్ మానేరు రివర్ ఫ్రంట్ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనుల పురోగతిని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత మేర భూసేకరణ పూర్తయింది, ఎంత పెండింగ్లో ఉంది, ఎదురవుతున్న సమస్యలు ఏమిటి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్?జగిత్యాల ఫోర్లేన్ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పురోగతిపై ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంత సేకరించారు. ఇంకా ఎంత మిగిలి ఉంది, పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని వివరాలు తెలుసుకున్నారు. అలాగే కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ భూసేకరణ, రైల్వే ఓవర్ బ్రిడ్జిల ఆర్ఓబీలు నిర్మాణానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.

## పేదల సంక్షేమాన్ని అడ్డుకునే

# రాజకీయాలను తిప్పికొట్టాలి

మహానగరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను కూడా ఆహ్వానిస్తోంది. ఈ క్రమంలోనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురువారం రోజున రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, దరఖాస్తుల ప్రక్రియ, అమలు విధానంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే గృహాలు నిర్మించేందుకు నియోజకవర్గాన్ని యూనిట్గా తీసుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో విలువైన ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమానికి వినియోగిస్తూ, అర్హులైన కుటుంబాలకు శాశ్వత గృహ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ టవర్స్ ద్వారా నగరంలో సొంత ఇల్లు లేని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన గృహాలను అందుబాటు ధరలో అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారమే ఈ గృహాల నిర్మాణం జరుగుతుందని స్పష్టం చేశారు. లబ్ధిదారులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. లబ్ధిదారుడి వాటా అన్ని ప్రాంతాల్లో రూ.6 లక్షలు మాత్రమే ఉంటుందని చెప్పారు. తొలి విడతలో ఎంపిక చేసిన 16 నియోజకవర్గాల్లో నిర్మించనున్న ఫ్లాట్ల మార్కెట్ విలువ సుమారు రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉండగా ఎస్ఆర్వో (బేసిక్) విలువ రూ.14.6 లక్షల నుంచి రూ.28.4 లక్షల వరకు ఉందన్నారు. భూమి విలువ, నిర్మాణ వ్యయం, ప్రభుత్వ సబ్సిడీ కలిపి అర్హులైన కుటుంబాలకు తక్కువ వ్యయంతో గృహాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా నిర్మించనున్న ఇందిరమ్మ గృహాల్లో యాజమాన్య హక్కుల కేటాయింపులో ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం, ప్రభుత్వ అవుట్సోర్సింగ్, నాలుగో తరగతి ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు 10 శాతం చొప్పున మొత్తం 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామని తెలిపారు. ఈ రిజర్వేషన్ కేటగిరీలలో 30 శాతం మహిళలకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. మిగిలిన 50 శాతం గృహాలను జనరల్ కేటగిరీలో కేటాయిస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అర్హులైన వారు సమీపంలోని మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అలాగే మీసేవ వాట్సాప్ నంబర్ 8096958096, మీసేవ వెబ్సైట్ ద్వారా కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. హైదరాబాద్ నడిబొడ్డున పేదలకు సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే.. ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలతో రాజకీయ లబ్ధిపొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

# విద్యార్థులకు ఫేషియల్ రికగ్నిషన్

**నిజామాబాద్,** తెలంగాణలో విద్యా వ్యవస్థలో పారదర్శకతను పెంచేందుకు, నకిలీ హాజరు విధానానికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ఇకపై స్టూడెంట్-టీచర్స్ (ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న విద్యార్థులు) పరీక్ష ఫీజు చెల్లించాలన్నా, లేదా వార్షిక పరీక్షలకు హాజరు కావాలన్నా బయోమెట్రిక్ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ హాజరు డేటా అత్యంత కీలకం కానుంది. ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదయ్యే హాజరును పరీక్షల అర్హత ప్రక్రియతో అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. నూతనంగా ప్రవేశపెట్టిన ఈ డిజిటల్ హాజరు అనుసంధాన ప్రక్రియ 2026-27 విద్యా సంవత్సరం నుంచే అమలు కానుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ నిర్వహణలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థలు ప్రైవేట్ మేనేజ్మెంట్ కళాశాలలకు ఇది వర్తిస్తుంది. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్ ద్వారా సేకరించే డేటాను విద్యార్థుల పరీక్షల అర్హతను నిర్ణయించేందుకు ప్రామాణికంగా ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది

. ఈ ఉత్తర్వుల ప్రకారం, తగిన హాజరు శాతం లేని విద్యార్థి ఉపాధ్యాయులు బోర్డు పరీక్షలకు హాజరయ్యే అవకాశం కోల్పోతారు. సాధారణంగా గతంలో విద్యాసంస్థలు మాన్యువల్గా పంపే అటెండెన్స్ రిజిస్టర్ల ఆధారంగా విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేవారు. దీనివల్ల కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థులు క్లాసులకు రాకపోయినా హాజరు ఉన్నట్లు చూపించే అక్రమాలు జరిగే అవకాశం ఉండేది.

కానీ ఈ కొత్త విధానం ప్రకారం, ప్రతిరోజూ కాలేజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా విద్యార్థి ముఖాన్ని స్కాన్ చేసి హాజరును ఆన్లైన్ సర్వర్లో నమోదు చేస్తారు. పరీక్షల నోటిఫికేషన్ విడుదలైనప్పుడు, విద్యార్థి నిర్దేశిత శాతం (ఉదాహరణకు 75 శాతం లేదా 80 శాతం) హాజరును కలిగి ఉంటేనే పరీక్షల పోర్టల్లో సదరు విద్యార్థి ఐడీ ఓపెన్ అవుతుంది. అప్పుడే పరీక్ష ఫీజు చెల్లింపునకు, హాల్ టికెట్ జనరేషన్కు సిస్టమ్ అనుమతిస్తుంది. హాజరు తక్కువగా ఉన్న విద్యార్థులను సాఫ్ట్వేర్ ఆటోమేటిక్గా రిజెక్ట్ చేస్తుంది.

ఈ సమగ్ర డిజిటల్ అనుసంధాన వ్యవస్థ ద్వారా విద్యాశాఖ పలు కీలక ప్రయోజనాలను ఆశిస్తోంది. పరీక్షల నిర్వహణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకత వస్తుంది. అర్హులైన, క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యే నిజమైన విద్యార్థులు మాత్రమే పరీక్షలు రాసేలా ఈ విధానం నిర్ధారిస్తుంది. మాన్యువల్ డేటా ఎంట్రీ, హాజరు లెక్కింపుల వల్ల జరిగే కాలయాపన తప్పుతుంది. డిజిటల్ డేటా నేరుగా పరీక్షల విభాగానికి లింక్ అవ్వడం వల్ల సమయం ఆదా అవుతుంది. కాబోయే ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా శిక్షణ తరగతులకు హాజరవడం ద్వారా ప్రాథమిక విద్యా బోధనలో అత్యుత్తమ నైపుణ్యాలను అలవర్చుకునే అవకాశం కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యా రంగంలో జవాబుదారీతనాన్ని మరింత పెంచుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# హమ్మయ్య.. వానలు పడ్డాయ్

**అదిలాబాద్,** ఎట్టకేలకు వరుణుడు కాస్త కరుణించడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల ముఖాల్లో మళ్లీ చిరునవ్వులు కనిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా వర్షం జాడ లేక ఎండిపోతున్న పంటలను చూసి ఆందోళన చెందుతున్న రైతులకు తాజాగా కురిసిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పెద్ద ఊరటనిచ్చింది. ఎల్ నీనో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ జల్లులు కొత్త ఆశలను నింపాయి. ఈ వానాకాలం ప్రారంభమైనప్పటి నుంచి జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు.

అడపాదడపా కురిసిన చిరు జల్లులు కూడా సాధారణ వర్షపాతాన్ని నమోదు చేయలేకపోయాయి. దీంతో పంటలు ఎండిపోతాయనే భయంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఒకవైపు పొలాల్లో తేమ పూర్తిగా తగ్గిపోగా, మరోవైపు వర్షం కోసం రైతులు కళ్లు కాయలు కాచే పరిస్థితి నెలకొంది.

వరుణుడు కరుణించాలని జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు కూడా నిర్వహించారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు చేసిన ప్రయత్నాలు అందరినీ కదిలించాయి. కొందరు స్ప్రింక్లర్లతో నీటిని అందిస్తూ పంటలను బతికించేందుకు శ్రమించగా, మరికొందరు ఎడ్లబండ్లపై డ్రమ్ముల్లో నీళ్లు తీసుకొచ్చి మొలకలకు పిచికారీ చేస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు.

వర్షాభావం కారణంగా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న రైతులకు ఈ వాన కొంత ఊరటనిచ్చిందనే చెప్పాలి. మంగళవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన ముసురు క్రమంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షంగా మారింది. ఆదిలాబాద్ జిల్లాలో తలమడుగు మండలం బరంపూర్లో అత్యధికంగా 13.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, ఇంద్రవెల్లి మండలం హీరాపూర్లో అత్యల్పంగా 1.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 13 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, భైంసాలో మాత్రం వర్షపాతం నమోదు కాలేదు. ఇప్పటికీ సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నా, తాజాగా కురిసిన వర్షం మాత్రం కొంత ఆశను నింపింది. ఇన్ని రోజులుగా వాన కోసం ఎదురు చూసిన రైతులకు ఈ జల్లులు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి.

ఎండిపోతున్న పంటలకు తేమ అందడంతో అవి మళ్లీ కోలుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాలు ఇదే విధంగా కొనసాగితే పంటలు గట్టెక్కుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వరుణుడు ఇలాగే కరుణిస్తే ఈ సీజన్లో పంటలను కాపాడుకోవచ్చనే నమ్మకం రైతుల్లో కనిపిస్తోంది.

# ఇటుకల వ్యాపారి ఆత్మహత్య



**ప్రొద్దుటూరు** పట్టణానికి చెందిన సిమెంట్ ఇటుకల వ్యాపారి నాయబ్ రసూల్ ఈరోజు తన ఇటుకల బట్టీలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలియరావల్సి ఉంది పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, కేసు నమోదు చేసుకుని ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నారు.

# రాజాంలో గంజాయి పట్టివేత

**విజయనగరం** రాజాం పట్టణంలో గంజాయి సేవిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు రాజాం పోలీసులు దాడి చేసి యువకులను పట్టుకున్నారు వారి నుండి గంజాయి అమ్ముతున్న వారి వివరాలను రాబట్టారు గంజాయి విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని ఎక్కడి నుంచి వస్తుందని వివరాలు సేకరించి మరో వ్యక్తిని ఒడిస్సా రాష్ట్రం రాయిగడ కి సంబంధించిన పండాను అదుపులోకి తీసుకున్నారు వీరి వద్ద నుండి సుమారు 5 కేజీల గంజాయి స్వాధీన పరుచుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించామని సీఐ నవీన్ కుమార్ తెలిపారు ఎవరైనా గంజాయి సేవించిన విక్రయించిన తమకు సమాచారం ఇవ్వాలన్నారు.. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

## శ్రావణమాస ఏర్పాట్లపై ప్రాథమిక సమావేశం

- ఆగస్టు 13న శ్రావణమాసోత్సవాలు ప్రారంభం
- సెప్టెంబరు 12వ తేదీన ముగియనున్న శ్రావణమాసోత్సవాలు



- శ్రావణమాసోత్సవాలపై ప్రాథమిక సమావేశాన్ని నిర్వహించిన కార్యనిర్వహణాధికారి

**శ్రీశైలం.**రాబోవు ధర్మకర్తల మండలి సమావేశంలో ఉత్సవ నిర్వహణకు సంబంధించి కూలంకష చర్చశ్రావణశుద్ధ పాడ్యమి, ఆగస్టు 13 నుంచి శ్రావణ మాసోత్సవాలు నిర్వహింపబడనున్నాయి. భాద్రశుద్ధ పాడ్యమి సెప్టెంబరు 12 ఉదయాన ఈ మాసోత్సవాలు ముగుస్తాయి.


ఈ మాసోత్సవాల ఏర్పాట్లకు సంబంధించి ఈ రోజు ( 23.07.2026) కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు ప్రాథమిక సమావేశాన్ని నిర్వహించారు. ఎ ి రి ఎా ల ఎా కార్యాలయములోని సమావేశమందిరములో నిర్వహించబడిన ఈ సమావేశంలో అర్చకస్వాములు, వేదపండితులు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ శ్రావణమాస ఏర్పాట్లపై రాబోవు ధర్మకర్తల మండలి సమావేశంలో కూలంకషంగా చర్చించి తదనుగుణంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ శ్రావణమాసోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు పలు ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రాన్ని సందర్శిస్తారన్నారు. ముఖ్యంగా శ్రావణమాసంలో రద్దీ దృష్ట్యా అన్ని విభాగాలు కూడా తగు ముందస్తు ప్రణాళికలతో ఉత్సవ నిర్వహణకు సిద్ధం కావాలని ఆదేశించారు. భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని విభాగాల వారు కూడా ముందస్తుగా ఆయా ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు అదేవిధంగా శ్రావణమాసములో ముఖ్యంగా శ్రావణ సోమవారాలు, శ్రావణపౌర్ణమి, వరలక్ష్మీవ్రతం, శుద్ధ మరియు బహుళ ఏకాదశి రోజులు, శ్రావణమాసశివరాత్రి మరియు ప్రభుత్వ సెలవురోజులలో అధికసంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించే అవకాశం ఉందన్నారు. ఆయా విభాగాల వారీగా చేపట్టవలసిన చర్యల గురించి కార్యనిర్వహణాధికారి వారు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా భక్తులందరికీ కూడా సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకుగాను అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆలయ మరియు క్యూకాంప్లెక్సు విభాగాన్ని ఆదేశించారు. క్యూలైన్లలో వేచివుండే భక్తుల సౌకర్యార్థం భక్తులందరికీ కూడా ఎప్పటికప్పుడు మంచినీరు, అల్పాహారం మరియు బిస్కెట్లను అందజేయాలని అన్నప్రసాద వితరణ విభాగాన్ని ఆదేశించారు.అదేవిధంగా భక్తుల రద్దీకనుగుణంగా అన్నదానమందిరంలో అన్నప్రసాదవితరణను, సాయంకాలం అల్పాహారాన్ని ఏర్పాటు చేయాలని అన్నదాన విభాగాన్ని ఆదేశించారు. అన్నప్రసాదవితరణలో వండిన వంటకాలన్నీ ప్రతీ భక్తుడికి అందాలన్నారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తుడికి కూడా ప్రతీ వంటకం అందాలన్నారు. భక్తులరద్దీకనుగుణంగా అవసరమైన మేరకు లడ్డూప్రసాదాలను తయారు చేసి అందుబాటులో ఉంచాలని ప్రసాదాల విభాగాన్ని ఆదేశించారు. భక్తులు లడ్డూప్రసాదాల కోసం అధికసమయం వేచివుండకుండా త్వరితంగా లడ్డూప్రసాదాలను అందజేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరం మేరకు అదనపు లడ్డు కౌంటర్లను ఏర్పాటు చేయాలని ప్రసాదాల విక్రయ విభాగాన్ని ఆదేశించారు. రద్దీరోజులలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని భద్రతా విభాగాన్ని ఆదేశించారు. ఈ విషయమై స్థానిక పోలీస్ శాఖ వారి సహకారాన్ని పొందాలని సూచించారుభక్తులరద్దీ దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను తొలగించేందుకు తగు చర్యలు చేపట్టాలని పారిశుధ్య విభాగాన్ని ఆదేశించారు.ఎప్పటి వలనే సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించేందుకు ఆయా ఏర్పాట్లను చేయాలని ఆలయ విభాగాన్ని ఆదేశించారు. అదేవిధంగా ప్రతీ సంవత్సరం వలనే శ్రావణ అఖండ శివనామ భజనలకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. శ్రావణమాసోత్సవాలను పురస్కరించుకుని సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించాలని ఆదేశించారు. మొత్తం మీద భక్తులకు, ముఖ్యంగా సర్వదర్శనం క్యూలైన్లలోని సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అన్ని విభాగాలను సూచించారు

## బాలయ్య బాబు త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

- లక్ష్మి నరసింహ దేవాలయంలో మంత్రాలయం

**నియోజవర్గం నందమూరి అభిమానులు ప్రత్యేక పూజలు**



**కౌతాళం** నందమూరి బాలకృష్ణ ఎన్బికె 111 సినిమా షూటింగ్లో మోకాలికి స్వల్ప గాయం అయినది కావున ఆయన త్వరగా కోలుకోవాలని శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరియు కొబ్బరికాయలు, ప్రసాదములు స్వామివారికి సమర్పించరు.ఇందులో మంత్రాలయం తాలూకా ప్రెసిడెంట్ ఉరుకుంద నరసింహనాయుడు,కార్యదర్శి

## కొలిమిగుండ్లలో టిడిపి కార్యకర్తల సమావేశం

- ఈనెల 27 నుండి టిడిపి ఇంటింటా ప్రచారం...



**కొలిమిగుండ్ల** .కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు కొలిమిగుండ్ల టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి టిడిపి నాయకులు కార్యకర్తలు బూతు ఇన్చార్జిలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా కొలిమిగుండ్ల టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి, నంద్యాల రామేశ్వర్ రెడ్డి, విఆర్. లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు. ఈనెల 27 నుండి గ్రామాలలో టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్ల సంక్షేమం అభివృద్ధి పథకాల గురించి మూలే రామేశ్వర్ రెడ్డి సభలో వివరించారు. సూపర్ సిక్స్ పథకాల కార్యక్రమంలో భాగంగా తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి ద్వారా మహిళలకు గ్యాస్ సిలిండర్లు రాయలసీమ అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు అభివృద్ధి, ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేపడుతుందని ఆయన అన్నారు. ఈనెల 27 నుంచి జరిగే ఇంటింట ప్రచార కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కొలిమిగుండ్ల టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వర్ రెడ్డి, కో కన్వీనర్ వీఆర్. లక్ష్మిరెడ్డి, గొంగటి హుస్సేన్ రెడ్డి, గొంగటి నారాయణరెడ్డి, అంబటి వివేకానంద రెడ్డి, ఇటిక్యాల శివారెడ్డి, లోకేపల్లె మధు ప్రసాద్ రెడ్డి, కత్తి రామదాసు, వెంకటేశ్వరరావు, కోటపాడు శివరామిరెడ్డి, శివారెడ్డి, తోట అమర్నాథ్ రెడ్డి, నాగ మల్లారెడ్డి, కళ్యాణ్ రెడ్డి, రవి ప్రకాశ్ రెడ్డి, పల్లె వెంకటేశ్వర్ రెడ్డి, వెన్నపూస రామచంద్రారెడ్డి, నంద్యాల ప్రసాద్, శివశంకర్, ఎర్రగుడి రాజగోపాల్, నిమ్మకాయల దస్తగిరి, చెన్నారెడ్డి, లోకనాథ్ రెడ్డి, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిడుగురాళ్ల మెడికల్ కాలేజ్ ని సందర్శించిన పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



**పిడుగురాళ్ల** పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణ పల్లి వద్ద గల ప్రభుత్వ మెడికల్ కాలేజీని దాని అనుబంధం ఆసుపత్రిని గురువారం పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా సందర్శించారు. ఈ సందర్భంగా ఓపి బ్లాక్ ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు మౌలిక సదుపాయాలు ఆమె పరిశీలించారు. అలాగే పరిశుభ్రత వైద్య సిబ్బంది పనితీరును సమీక్షించారు. రోగులకు నాణ్యమైన వైద్యం సేవలు అందించాలని వారికి సూచించారు. ప్రజల వద్ద నుండి భారీగా స్పందన వస్తుందని ప్రతిరోజు వందల సంఖ్యలో రోగులు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు తీసుకుంటున్నారని కలెక్టర్ శుక్లా మీడియాకు తెలిపారు.

# 24న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి



**చిట్వేలి** నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి దేవేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 24వ తేదీ విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు తుమ్మల కృష్ణ చైతన్య కోరారు. రైల్వే కోడూరు సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2014 నుండి దేశవ్యాప్తంగా 152 పరీక్షా పేపర్లు లీక్ అయ్యాయి అన్నారు. నీట్ పేపర్ లీకేజ్ కారణంగా దేశవ్యాప్తంగా 22 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, నీట్ పేపర్ లీకేజీకి ప్రభుత్వం భాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 20వ తేదీ లక్షలాది మంది విద్యార్థుల శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థి, యువతపై అత్యంత అమానవీయంగా లాఠీఛార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ఉపయోగించడం హేయమైన చర్య అన్నారు. దేశ విద్యావ్యవస్థలో సమూల మార్పులు కావాలని, నీట్ పరీక్షా విధానం రద్దుచేసి రాష్ట్రాల వారిగా మెడికల్ ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు యశ్వంత్, అరవింద్ ప్రేమ్, గణేష్, మణి పాల్గొన్నారు.

## దేవాలయాల పవిత్రతను, భక్తుల ప్రయోజనాలను కాపాడాలి

- మాజీ మంత్రి వెలంపల్లి

**విజయవాడ** తిరుమల నడకదారి/ఘాట్ రోడ్డులోని క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామి విగ్రహం అపహరణకు గురికావడం టీటీడీ పాలనా వైఫల్యానికి నిదర్శనం. పరిపాలన చేతకాని బీఆర్ నాయుడు వెంటనే టీటీడీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలి; దేవస్థానం అంతా అవినీతిమయమైందని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అన్నారు.గురువారం అయన మీడియాతో మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి నాడు భక్తుల మరణాలు, తిరుమలలో చెప్పులేసుకుని తిరగడం, భక్తులకు కనీస సదుపాయాలు (పాలు, ప్రసాదాలు) లేకపోవడం దుర్మార్గం. అబద్ధాలకి, రాజకీయాలకే సనాతన ధర్మం, దీక్షలు గుర్తుకొస్తాయా? ఇప్పుడు జరిగిన ఘటనకు గుడి మెట్లు కడగరా? దేవాదాయ శాఖ మంత్రికి శాఖపై కనీస గ్రిప్, అవగాహన లేవు. వైసీపీలో గెలిచి టీడీపీకి ఓటేసిన ఆయనకు మాట్లాడే నైతిక హక్కు లేదు. కోవిడ్ సమయంలో రథం కాలితే వైసీపీ ప్రభుత్వం తక్షణమే అఃఎ విచారణకు జీవో ఇచ్చింది; కూటమి ప్రభుత్వం ఇప్పటికీ దానిపై ఎందుకు ముందుకు వెళ్లడం లేదు రామ్తీర్థం ఆలయాన్ని రూ. 3 కోట్లతో 9 నెలల్లో రాతి కట్టడంగా పునర్నిర్మించాం అమ్మవారి వెండి సింహాల చోరీ దొంగలను పట్టుకుని 2023లోనే రికవరీ చేశామని అన్నారు.2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం విజయవాడతో సహా అనేక చోట్ల అడ్డగోలుగా గుళ్లను, విగ్రహాలను కూల్చేసింది; ఆ విగ్రహాలను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పునర్నిర్మించారు. అమ్మవారి గుడి అభివృద్ధి కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం రూ. 70 కోట్ల నిధులు కేటాయించింది; ఆధారాలతో సహా మాట్లాడుతున్నాం. దేవాదాయ శాఖ నిధులను ఇతర పథకాలకు మళ్లించడం తగదు. దేవాలయాల పవిత్రతను, భక్తుల ప్రయోజనాలను కాపాడకపోతే వైసీపీ తరఫున పెద్ద ఎత్తున ఉద్యమిస్తాంమని అన్నారు.

# గురుకుల పాఠశాలలో గ్యాస్ లీకేజీ

**పశ్చిమ గోదావరి** పెనుగొండ గురుకుల బాలికల పాఠశాలలో గ్యాస్ లీకేజ్‌తో అగ్నిప్రమాదం.. తృటిలో తప్పిన భారీ ప్రమాదం పెనుగొండ గ్రామంలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం ఉదయం గ్యాస్ లీకేజ్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనతో పాఠశాలలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి.ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో వంటశాలలో గ్యాస్ సిలిండర్ మారుస్తుండగా సిలిండర్ సీల్ తొలగించిన వెంటనే గ్యాస్ లీక్ అయింది. అదే సమయంలో పక్కనే ఉన్న మరో గ్యాస్ పొయ్యిపై వంట జరుగుతుండటంతో మంటలు లీకైన గ్యాస్‌కు అంటుకుని అగ్నిప్రమాదం సంభవించింది.ఆ సమయంలో పాఠశాలలో సుమారు 430 మంది విద్యార్థినులు ఉండటంతో ఒక్కసారిగా తొక్కిసలాట నెలకొంది. ఈ ఘటనలో వంటశాలలో పనిచేస్తున్న ఓ మహిళకు గాయాలు కాగా, తొక్కిసలాటలో ఒక విద్యార్థిని కూడా స్వల్పంగా గాయపడింది.విషయం తెలుసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళనతో పాఠశాలకు చేరుకున్నారు. అయితే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో భారీ ప్రమాదం తప్పింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.ప్రమాదం అనంతరం పరిస్థితి సాధారణ స్థితికి చేరుకోవడంతో పాఠశాలలో యథావిధిగా తరగతులు కొనసాగించారు.

## మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసిన నాట్స్ ఏరో స్పేస్ సంస్థ ప్రతినిధులు



**విజయవాడ** గురువారం నాడు సచివాలయంలోని ఆర్&బీ, ఐ&ఐ శాఖ కార్యాలయంలో పెట్టుబడులు & మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని నాట్స్ ఏరో స్పేస్ సంస్థ ప్రతినిధి అథిరాజ్ సింగ్ చావ్లా కలిసారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అథిరాజ్ సింగ్ చావ్లా ఆసక్తి వ్యక్తం చేసారు. పైలట్ శిక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ కార్యక్రమాలు, దేశీయ మరియు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అవకాశాల్లో న్న ఢిల్లీకి చెందిన నాట్స్ ఏరో స్పేస్ సంస్థ అనుభవం వేంది. రాష్ట్రంలోని నాగార్జున సాగర్ ఎయిర్ పోర్టు లేదా కర్నూలు ఎయిర్ పోర్టుల్లో ఈటూ (ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్) ఏర్పాటుకు నాట్స్ ఏరో స్పేస్ సంస్థ ముందుకు వచ్చింది.వచ్చే 5 ఏళ్లలో దాదాపు రూ. 100 కోట్ల పెట్టుబడితో 100 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ తెలిపింది. 5 ఏళ్లలో ట్రైనింగ్ ఎయిర్ క్రాఫ్ట్ లు 6 నుంచి 20 కు పెంచేలా ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్ ను అభివృద్ధి చేస్తామని మంత్రికి ప్రతినిధులు చెప్పారు.ఈ సంస్థ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు, ఏవియేషన్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు యువతలో అభివృద్ధి చేయవచ్చని మంత్రి ఆశాభావం వ్యక్తం చేసారు. పూర్తి స్థాయి ప్రతిపాదనలతో ముందుకు వస్తే, అన్ని విధాలుగా సహకరిస్తామని మంత్రి సానుకూలంగా స్పందించారు. .

# బద్వేల్‌లో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమావేశం




**బద్వేలు** బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జీలు , యూనిట్ ఇంచార్జీలు, బూత్ ఇంచార్జీలు మరియు ముఖ్య నాయకులు హాజరయ్యారు.×ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న డోర్ టు డోర్ క్యాంపెయిన్‌పై అవగాహన కల్పిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసి ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని సమన్వయంతో, క్రమశిక్షణతో నిర్వహించి విజయవంతం చేయాలని, ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకోవాలని పేర్కొన్నారు.అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఏకపక్షంగా ఎగిరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అందరూ సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.

# బీ-ఫారం పట్టాదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

**దశలవారీగా అర్హులందరికీ పట్టాలు.**

**మాట నిలబెడతాం: బొండా ఉమా**



విజయవాడ(ప్రశ్న న్యూస్) విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని నేతాజీ కాలనీ, పి.వి. నరసింహారావు రోడ్, తుంగం రాములు వీధి ప్రాంతాల బీ-ఫారం పట్టాదారులకు దశలవారీగా రిజిస్ట్రేషన్ కల్పిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం 29వ డివిజన్ నేతాజీ కాలనీలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన బీ-ఫారం పట్టాదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే తమ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరిస్తోందని చెప్పారు.
నేతాజీ కాలనీ, పి.వి. నరసింహారావు రోడ్, తుంగం రాములు వీధి ప్రాంతాల భూములు గతంలో ఇరిగేషన్ క్లాసిఫికేషన్‌లో ఉండటంతో న్యాయ, పరిపాలనా సమస్యలు తలెత్తాయని, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం అవసరమైన ప్రక్రియలు పూర్తి చేసి ప్రభుత్వం పరిష్కార చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు, రెవెన్యూ శాఖ, కలెక్టర్ కార్యాలయం తదితర పరిపాలనా ప్రక్రియల కారణంగా కొంత సమయం పట్టినా, ప్రతి అర్హ కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామని తెలిపారు. "ప్రజలకు ఒకసారి మాట ఇస్తే తప్పకుండా నిలబెడతాం. ఎన్ని అడ్డంకులు వచ్చినా ప్రతి అర్హ కుటుంబానికి రిజిస్ట్రేషన్ కల్పించే వరకు వెనక్కి తగ్గేది లేదు" అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, సింగం వెంకన్న, కమ్మినేని సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీడీపీ సీనియర్ నాయకుడిని పరామర్శించిన: గొట్టిపాటి లక్ష్మీ

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**



దర్శి(ప్రశ్న న్యూస్) దర్శి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రె సుబ్బారెడ్డి ఇటీవల కాలు శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటుండగా, దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ గురువారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యుల సూచనలు పాటిస్తూ త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం ఆయన అందించిన సేవలను గుర్తు చేస్తూ, ధైర్యంగా ఉండాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మండల టీడీపీ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, కొత్తపల్లి గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఎదులాబాద్ జెడ్పీహెచ్ఎస్‌లో ఏఐ డిజిటల్ ల్యాబ్ ప్రారంభం

**టీడీఎఫ్ 'మన తెలంగాణ బడి' కార్యక్రమంలో**

**ఆధునిక సాంకేతిక వసతుల కల్పన**



ఘట్‌కేసర్ ( ప్రశ్న న్యూస్ ) ఘట్‌కేసర్ సర్కిల్‌లోని ఎదులాబాద్ జెడ్పీహెచ్ఎస్ బాలికల ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్) ఆధ్వర్యంలో ఏఐ ఆధారిత డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు.
టీడీఎఫ్ అమెరికా అట్లాంటా చాప్టర్, టీడీఎఫ్ ఇండియా సంయుక్త సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌కు స్వాతి సుదిని, విక్రమ్ రెడ్డి సుదిని దంపతులు ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా టీడీఎఫ్ ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించడమే లక్ష్యమని తెలిపారు. అలాగే జైకిసాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశీయ విత్తనాలు పంపిణీ చేశారు. కొండల వెంకట కృష్ణారెడ్డి బాలుర ప్రభుత్వ పాఠశాలకు మరో కంప్యూటర్ ల్యాబ్‌ను విరాళంగా అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో టీడీఎఫ్ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భోగాపురానికి ప్రతి అరగంటకో ఏరో ఎక్స్‌ప్రెస్

**ప్రారంభోత్సవానికి భారీ ఏర్పాట్లు..**

**జిల్లా నుంచి 50 వేల మంది తరలింపు**

**అనుసంధాన రహదారుల పనులు వేగవంతం**

**పింఛన్ల పంపిణీకి ప్రత్యామ్నాయ చర్యలు**

**కలెక్టర్ అభిషిక్త్ కిశోర్**



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం నేపథ్యంలో నగరం నుంచి విమానాశ్రయానికి ప్రతి అరగంటకో ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సు నడిపేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. నగరంలో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక లాంజ్‌ల నుంచి ఈ బస్సులు నడుస్తాయని, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సేవలను విస్తరిస్తామని చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం జిల్లాకు 100 బస్సులు కేటాయించగా ఇప్పటికే 20 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. భోగాపురం విమానాశ్రయానికి ప్రత్యేక ఏసీ బస్సు సేవలతో పాటు ఓలా, ఉబర్ వంటి క్యాబ్ సేవలను కూడా ప్రారంభం నుంచే అందుబాటులోకి తీసుకురావడానికి జీఎంఆర్ సంస్థతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. 230 కి.మీ. అనుసంధాన రహదారులకు మెరుగులుభోగాపురం విమానాశ్రయానికి అనుసంధానంగా ఉన్న 28 రహదారులపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ తెలిపారు. మొత్తం 230 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారులపై మరమ్మతులు, విస్తరణ, జంక్షన్‌ల అభివృద్ధి, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఏడు ప్రధాన రహదారుల్లో నాలుగు ఇప్పటికే పూర్తయ్యాయని, మరో రెండు ఈ నెలాఖరులోగా పూర్తి కానున్నాయని వివరించారు. భవిష్యత్తు ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు, డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ వంటి ప్రాజెక్టులపైనా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రధాని సభకు భారీ ఏర్పాట్లుఆగస్టు 1న జరిగే విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విశాఖపట్నం జిల్లా నుంచి సుమారు 50 వేల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 11 మండలాల నుంచి ప్రజలను తరలించేందుకు ప్రత్యేక బస్సులు, వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రారంభోత్సవ రోజున ప్రధానమంత్రి విమానం మాత్రమే భోగాపురం విమానాశ్రయంలో దిగుతుందని, సాధారణ వాణిజ్య విమాన సర్వీసులు ఆ రోజున ప్రారంభం కావని స్పష్టం చేశారు. అదే రోజు సెమీకండక్టర్ ప్రాజెక్టుకు శంకుస్థాపనఆగస్టు 1న భారతదేశంలో తొలి ఇండియన్ సెమీకండక్టర్ మిషన్ (ఇూూ ఞూ ౧వవఓష్ట్రఅశీశ్రీశీస్త్రఱవం) ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు హాజరుకానున్నారని చెప్పారు. అదే రోజు పింఛన్ల పంపిణీకి ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సింహాచలం గిరి ప్రదక్షిణకు విస్తృత ఏర్పాట్లుఈ నెల 28న జరిగే సింహాచలం గిరి ప్రదక్షిణకు 5 నుంచి 10 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశముందని కలెక్టర్ తెలిపారు. 32 కిలోమీటర్ల మార్గాన్ని 30 విభాగాలుగా విభజించి ప్రతి చోట తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, పోలీసు భద్రత, సహాయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు, షవర్ బాత్ సదుపాయాలు, అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయని, రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు మూసివేయనున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ వెల్లడించారు.

# రాహుల్ అరెస్టు ఖండిస్తూ కాంగ్రెస్ రోడ్డెక్కింది

**కీసరలో నిరసన.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్, మోదీ దిష్టిబొమ్మ దహనం**

**ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం కొనసాగుతుందన్న కాంగ్రెస్ నాయకులు**

**రాహుల్ గాంధీ అరెస్టు రాజకీయ కక్షసాధింపులో భాగం**

**- కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు స్వప్న విజయ్ రెడ్డి**



కీసర( ప్రశ్న న్యూస్) లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ, నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కీసర అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రామిడి సప్న విజయ్ రెడ్డి మాట్లాడుతూ, రాహుల్ గాంధీ అరెస్టు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును అణిచివేసే చర్యలు తగవని, కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు.
అలాగే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వివిధ డివిజన్ల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, విద్యార్థుల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.

# విద్యతో ఆటలు,విద్యార్థుల భవిష్యత్తు అయోమయం: ఎమ్మెల్యే




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బిజెపి విధానాలకు వ్యతిరేకంగా,కాంగ్రెస్ అగ్రనేతల అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా కంటోన్మెంట్ లో భారీ నిరసన ర్యాలీ పికెట్ నుంచి మొదలు కొని కర్భాన రాజీవ్ రహదారిపై ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు. కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీతో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ,అలాగే జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు వారిపై లాఠీ చార్జి చేయడం పై కంటోన్మెంట్ లో ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతూ,వారిపై చేస్తున్న దౌర్జన్యాలకు నిరసనగా కంటోన్మెంట్ లోభారీ ర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ తదితర పరీక్ష పత్రాల లీక్ కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని,పరీక్ష పత్రాల లీకేజీకి పాల్పడిన అసలు కారకులను,వారెంతటి వారైనా సరే గుర్తించి కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వ నిర్లక్ష్యం,పేపర్ లీక్ ల వల్ల తీవ్ర మనస్తాపానికి గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు తక్షణమే న్యాయం చేసి, వారికి అండగా నిలవాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ డిమాండ్ చేశారు. అలిగే కేంద్ర విద్య శాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌డిష్టి బొమ్మ కాల్చి నిరస వ్యక్తి చేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు, మాజీ ఛైర్మన్ ముప్పిడి గోపాల్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డి, బద్రీ యాదవ్, సంతోష్ యాదవ్, వైష్ణవి యాదవ్,బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు కృష్ణ రెడ్డి, శరత్, సంతోష్ కుమార్,రాము,అంజి, మాజీ టాపిసిసి రాజేష్ యాదవ్,శాంసన్ రాజు, సామాజిక కార్యకర్త నయిం, నాగినేని సరిత,సంకీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# కీసరలో వ్యక్తి అనుమానాస్పద మృతి.. మిస్సింగ్ కేసు విషాదాంతం

**30 రోజులుగా కనిపించని వ్యక్తి భూట్‌బంగ్లా సమీపంలో మృతదేహంగా లభ్యం.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కీసర పోలీసులు**



కీసర( ప్రశ్న న్యూస్) కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల రోజులుగా కనిపించకుండా పోయిన ఓ వ్యక్తి మృతదేహంగా లభించడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా బాలంపల్లి గ్రామానికి చెందిన రాములు (55) గత నెల 30న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో కీసర పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో కీసర సమీపంలోని భూట్‌బంగ్లా వద్ద ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు అది రాములుదేనని నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించిన పోలీసులు, మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# వరుణ యాగంలో పాల్గొన్న మంత్రి కొండ సురేఖ

**యాదగిరిగుట్ట దేవస్థానంలో నిర్వహించిన వరుణ యాగం**

**వర్షాలు కురవాలని దేవాదాయ శాఖలో ఉన్న దేవాలయాలలో వరుణ యాగాలు**





యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో వేద మంత్రోచ్చారణలు, హోమాగ్నుల మధ్య ఘనంగా నిర్వహించిన వరుణయాగ పూర్ణాహుతిలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, రైతాంగ శ్రేయస్సు, ప్రకృతి సమతుల్యత నెలకొనాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి తెలంగాణ సస్యశ్యామలంగా మారాలని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని మంత్రి సురేఖ ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రకృతి సమతుల్యత నెలకొనాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో వరుణయాగం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో రాకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి ఈ సమస్యను అధిగమించడానికి కార్యాచరణను అమలు చేస్తున్నారని తెలిపారు. మానవశక్తికి దైవశక్తి కూడా తోడవ్వాలనే సంకల్పంతో రాష్ట్రంలోని దేవాలయాల్లో వరుణ యాగాలు నిర్వహిస్తామన్నారు. ప్రకృతిని దైవస్వరూపంగా ఆరాధించే భారతీయ సంస్కృతిలో వరుణ యాగం అనేది కేవలం ఒక వైదిక క్రతువు మాత్రమే కాదని, ప్రకృతి సమతుల్యత, ప్రజల శ్రేయస్సు, సమృద్ధిగా వర్షాలు కురవాలనే మహా సంకల్పానికి ప్రతీక అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన వరుణ యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో మంత్రి సురేఖ పాల్గొన్నారు. ఈ కార్యాచరణలో భాగంగా యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన వరుణ యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, హోమాగ్ని జ్వాలల మధ్య వేదపండితులతో కలిసి మంత్రి సురేఖ అగ్నిదేవునికి పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, రైతాంగ శ్రేయస్సు, ప్రకృతి సమతుల్యత, సమృద్ధిగా వర్షాలు కురిసి తెలంగాణ సస్యశ్యామలంగా మారాలని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని మంత్రి సురేఖ ప్రార్థించారు. దేవాలయానికి వచ్చిన మంత్రికి దేవస్థాన ఈఓ భవానీ శంకర్, డిప్యూటీ ఈవో భాస్కర్, ప్రధాన అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. పూర్ణాహుతి అనంతరం దేవస్థాన అర్చకులు మంత్రికి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ట్రస్ట్ బోర్డ్ మెంబర్ లక్ష్మి నారాయణ నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళాన్ని దోచుకున్న 'గొడ్డలి' ముఠా,

## అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టం: ఎమ్మెల్యే గొండు శంకర్




శ్రీకాకుళం(ప్రశ్న న్యూస్) గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని శ్రీకాకుళం జిల్లాలో భారీ స్థాయిలో భూదందాలు, అక్రమాలు జరిగాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆరోపించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న కొందరు నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడి ప్రజల ఆస్తులను కాజేసే ప్రయత్నాలు చేశారని విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేలా రౌడీయిజం, దౌర్జన్యాలు, భూకబ్జాలు జరిగాయని ఆయన అన్నారు. కొందరు నేతలు తమ పేర్లతో నగరాలు ఏర్పాటు చేయడం, భూ పత్రాల్లో అక్రమ మార్పులు చేయడం, బతికున్న వ్యక్తులను మరణించినట్లు చూపించి నకిలీ పత్రాలు సృష్టించడం వంటి తీవ్రమైన అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. మైనింగ్, మద్యం, భూదందాల ద్వారా ప్రజల సంపదను దోచుకున్న విషయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి గతంలో కొందరు నేతలను కుటుంబ సభ్యుల్లా సంబోధించారని గుర్తు చేసిన గొండు శంకర్, ఇప్పుడు వారిపై వస్తున్న ఆరోపణలకు వైసీపీ సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ ప్రజలకు పారదర్శకమైన, బాధ్యతాయుతమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# దోషులకు జగన్ వత్తాసు దేనికి సంకేతం

## ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

## భూ కబ్జాలు, ప్రమాద ఘటనలపై వైసీపీ నేతల తీరును విమర్శించిన నరసన్నపేట ఎమ్మెల్యే



శ్రీకాకుళం(ప్రశ్న న్యూస్) వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు, భూ కుంభకోణాలపై ప్రజలు ఎన్నికల్లో స్పష్టమైన తీర్పు ఇచ్చినా ఆ పార్టీ నాయకుల తీరులో ఇప్పటికీ మార్పు కనిపించడం లేదని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి విమర్శించారు. శ్రీకాకుళంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నేరారోపణలు ఎదుర్కొంటున్న వారికి వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మద్దతు తెలపడం ప్రజలకు తప్పు సంకేతాలు పంపుతుందని అన్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన రోడ్డు ప్రమాద ఘటనను ప్రస్తావిస్తూ, ప్రమాదం ఎవరైనా చేయవచ్చని, అయితే అనంతరం బాధితుడి పట్ల మానవత్వంతో వ్యవహరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుందని పేర్కొన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడికి వెంటనే వైద్యం అందేలా చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదని వ్యాఖ్యానించారు. అయితే ఘటన తర్వాత బాధితుడికి అండగా నిలవకుండా, నిందితుడిని రక్షించే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. తనపై వచ్చిన విమర్శలను ఎదుర్కొనేందుకు కుల అంశాన్ని ప్రస్తావించడం సరికాదని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని బగ్గు రమణమూర్తి అన్నారు. ప్రజల ముందుకు వెళ్లే ముందు ఈ అంశాలపై మాజీ మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిజాలు వెలుగులోకి రావాలని, ఎవరైనా తప్పు చేసి ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్పష్టం చేశారు.

# ఉపరాష్ట్రపతిని కలిసిన టీడీపీ నూతన ఎంపీలు

## ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని

## సూచించిన సి.పి. రాధాకృష్ణన్



న్యూఢిల్లీ(ప్రశ్న న్యూస్)పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా తెలుగుదేశం పార్టీకి చెందిన నూతన ఎంపీలు సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ గురువారం భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ సమావేశాల విరామ సమయంలో జరిగిన ఈ భేటీలో నూతనంగా లోక్‌సభలో అడుగుపెట్టిన ఎంపీలకు ఉపరాష్ట్రపతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రజా సమస్యలను పార్లమెంట్ వేదికగా సమర్థవంతంగా ప్రస్తావించాలని సూచించారు. పార్లమెంటరీ సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని, ప్రజాప్రతినిధులుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఉపరాష్ట్రపతి ఆకాంక్షించారు. టీడీపీ ఎంపీలు కూడా తమ నియోజకవర్గాల అభివృద్ధితో పాటు రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో చురుకైన పాత్ర పోషిస్తామని ఉపరాష్ట్రపతికి తెలిపారు

# రాహుల్, ప్రియాంకల అరెస్టుకు నిరసనగా దద్దరిల్లుతున్న మేడ్చల్ జిల్లా

## బోడుప్పల్ ఘట్కేసర్ అలియాబాద్ లో కాంగ్రెస్ ర్యాలీ

## మేడ్చల్ లో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం

## ప్రధాని మోడీకి వ్యతిరేకంగా నినాదాలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ లను అరెస్టు చేయడానికి నిరసిస్తూ కాంగ్రెస్ నేత చేపడుతున్న ఆందోళనలతో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా దద్దరిల్లింది. బోడుప్పల్ ఘట్కేసర్ లో కాంగ్రెస్ శ్రేణులు శాంతియుత రాలిని నిర్వహించగా మేడ్చల్ లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిగ్గు.. సిగ్గు... నీట్ పరీక్ష లీక్ అంటూ నినాదాలు చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. నీట్ పేపర్ లీకేజ్ కు వ్యతిరేకంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును ఖండిస్తూ విద్యార్థులకు మద్దతుగా శాంతియుతంగా నిరసన తెలిపిన ఏఐసీసీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ లను అరెస్టు చేయడం నిరసిస్తూ బోడుప్పల్ ఘట్కేసర్ లో కాంగ్రెస్ శ్రేణులు శాంతియుత ర్యాలీని నిర్వహించారు. పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, ఇంచార్జి గజ్జలకాంతం మాజీ మేయర్ తోటకూర అజయ్ కుమార్ మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ పాల్గొన్నారు.

### మేడ్చల్ లో...

ఏఐసీసీ,టీపీసీసీ మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ జంగయ్య యాదవ్ పిలుపు మేరకు రాహుల్ గాంధీ మల్లికార్జున్ ఖర్గే ,ప్రియాంక గాంధీ ,ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును ఖండిస్తూ నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన "ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్,మేడ్చల్ సర్కిల్,ఎల్లంపేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు,రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతుంది. నిర్బంధాలు,బెదిరింపులతో ప్రజల గొంతును అణచివేయలేరన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ 297 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు(చాపరాజు) ముదిరాజ్,కిష్టాపూర్ పూడూర్ 298 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,గుండ్ల పోచంపల్లి 299డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్,ఎల్లంపేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు కురుమ,మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ కురుమ,జాకట దేవరాజ్,కౌడే మహేష్ కురుమ,సముద్రం సాయి కుమార్,పాలకుర్తి రాఘవేందర్ గౌడ్,నారెడ్డి రవీందర్ రెడ్డి,వీరమల్ల శ్రావణ్ కుమార్ గుప్తా,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గువ్వ రవి ముదిరాజ్,గోమారం బాల్ రెడ్డి,కనకాల శివ కుమార్ (బిపిటిరాజు),మహమ్మద్ అయూబ్ ఖాన్ యూసుఫ్,మహమ్మద్ షాహిన్ పాషా,రామన్నగారి రాఘవేందర్ గౌడ్,నడికొప్పు రంజిత్ ముదిరాజ్,వెంకట్ రాంరెడ్డి,దుర్గం వెంకటేష్ ముదిరాజ్,మేకల రాజశేఖర్ రెడ్డి (బబ్లూ),నడికొప్పు బాల మల్లేష్ ముదిరాజ్,ఉదండపురం సత్యనారాయణ,గోమారం రమణా రెడ్డి,బండి శ్రీనివాస్ గౌడ్,భేరి ఈశ్వర్,దుబ్బ రామస్వామి ముదిరాజ్,విభూది యాదగిరి,పెగుడ శ్యాంరావ్,వరదా రెడ్డి,మురళీ గౌడ్,హనుమంత్ రెడ్డి,చిల్ల వెంకటేష్ ముదిరాజ్,వినోద్ గౌడ్,సంజీవ రావు,దొడ్ల మోహన్ ముదిరాజ్,బొక్క రఘుపతి రెడ్డి,చంద్రయ్య గౌడ్, మరిగల బాబు,ప్రకాష్ రెడ్డి,వెంకటేష్, చీర్ల ఆకాష్, మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి,మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్ కురుమ, మేడ్చల్ మున్సిపాలిటీ ఎస్ సి సెల్ అధ్యక్షులు దండు శ్రీకాంత్ (చింటు), మేడ్చల్ మున్సిపాలిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రేమలత, మల్లీశ్వరి, వినోద, శ్యామల,రేణుక, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు ,కార్యకర్తలు, యువకులు, మహిళలు తదితరులు తదితరులు పాల్గొన్నారు

### అలియాబాదులో...

రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ అలియాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ శాంతియుత నిరసన ర్యాలీ ని నిర్వహించారు. అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ అలియాబాద్ కేంద్రంలోని (డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం)నుండి ప్రారంభమై బస్టాప్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో లిమున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణ రెడ్డి ఏఎంసీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ జిల్లా ఆర్టిఏ మెంబెర్ బిమిడి జైపాల్ రెడ్డి ఏ బ్లాక్ అధ్యక్షులు జీడిపల్లి వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులపై అక్రమ అరెస్టులు, వేధింపులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుంది" అని స్పష్టం చేశారు. ఈ నిరసన ర్యాలీలో మాజీ సర్పంచ్ కంఠం కృష్ణ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ ఎంపిటిసి సరసం అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఏళ్ళ మల్లేష్, కాంగ్రెస్ నాయకులు లత వెల్మ రెడ్డి,బండారి బాబు, నేమురిరాంప్రసాద్, అబ్బాగౌని భాస్కర్ గౌడ్, మేడి మల్లేష, తంటం యాదగిరి, కత్తి రమేష్, ఊరడి వెంకటేష్, తుంకి స్వామి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పప్పుల వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దం రాఘవ రెడ్డి, ముద్దం ధర్మ రెడ్డి, జామల్పూర్ బన్సీలాల్, కుడుముల వెంకటేష్, కొమ్ము వినోద్, గాదె యాదగిరి, చాట్లపల్లి నర్సింగరావు, నల్ల పండు, వల్లపు మహేష్, బోయిని సాయి కుమార్,జమాల్పూర్ నాగరాజు, కొంగ సాయిబాబు,పల్లె రాంబాబు,కొక్కొండ శ్రీధర్ రెడ్డి,కొంకలా గంగిరెడ్డి, బోయిరి సంతోష్ రావు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బదిలీ అయిన పోలీసు సిబ్బందికి ఘన వీడ్కోలు

## - నూతన సిబ్బందికి ఆత్మీయ స్వాగతం





గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) తొగుట సర్కిల్ పరిధిలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి 38 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఇతర పోలీస్ స్టేషన్లకు బదిలీ కాగా, 40 మంది సిబ్బంది తొగుట సర్కిల్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీపై వచ్చారు. అదేవిధంగా తొగుట ఎస్సై వి. రవికాంతరావు, కుక్కునూరుపల్లి మాజీ ఎస్సై పి. శ్రీనివాస్, బేగంపేట మాజీ ఎస్సై మహిపాల్ రెడ్డి బదిలీపై వెళ్లిన సందర్భంగా వీరికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తొగుట సీఐ లతీఫ్, కుక్కునూరుపల్లి ఎస్సై బాలకృష్ణ, తొగుట ఎస్సై వి. నవీన్, రాయపోల్ ఎస్సై మానస, దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్, బేగంపేట ఎస్సై రేణుక ఆధ్వర్యంలో వీడ్కోలు-స్వాగత సమావేశం నిర్వహించారు. బదిలీపై వెళ్లిన సిబ్బందిని ఘనంగా సన్మానించడంతో పాటు, కొత్తగా వచ్చిన సిబ్బందికి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, గజ్వేల్ డివిజన్ ఏసీపీ నర్సింలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు బదిలీపై వెళ్లిన, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పోలీసు సిబ్బందిని అభినందిస్తూ, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తూ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని బదిలీ అయిన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కామధేను పౌండేషన్ ఆధ్వర్యంలో యంఎన్‌జే ఆస్పత్రికి 1.5 లక్షల విలువైన ఫర్నిచర్ విరాళం




నాంపల్లి (ప్రశ్న న్యూస్) మానవ సేవే మాధవసేవ అనే నానుడిని నిజం చేస్తు కామధేను ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నాడు యం.ఎన్.జే క్యాన్సర్ హాస్పిటల్ పిల్లల వార్డులో అవసరమయ్యే లక్ష యాభై వేల రూపాయల విలువైన టేబుల్స్, కుర్చీలు, బ్లడ్ శాంపిల్స్ సేకరించేందుకు ఉపయోగించే ఫర్నిచర్ మెటీరియల్ ను విరాళంగా అందివ్వడం హర్షణీయం. ఈ సందర్భంగా యం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రిలో బుధవారం నాడు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గోన్న తెలంగాణ హర్టికల్చర్ శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఐఏఎస్, మాట్లాడుతున్న క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు తమ జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని, మంచి అలవాట్లను పాటిస్తు వ్యాయామం, యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత పొందడంతో సంపూర్ణమైన ఆరోగ్యం చేకూరుతుందని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరు విధిగా ఒక మొక్కను నాటాలని, ఈ మొక్కలు పెద్దవై మనకు అవసరమయ్యే స్వచ్ఛమైన ప్రాణవాయువు అందిస్తాయని అన్నారు. జిహెచ్‌యంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్ మాట్లాడుతు గతంతో పోల్చుకుంటే ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో ఒక బలమైన నమ్మకం బలపడిందని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది పనితీరు, ఉద్యోగ భాధ్యతల పట్ల వారిలో ఉన్న అంకుటిత దీక్షతో సర్కార్ ఆస్పత్రుల్లో కార్పోరేట్ చికిత్సలు అందుతున్నాయని తెలిపారు. కామధేనువు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగుల సౌకర్యార్థం అందిస్తున్న ఫర్నిచర్ తో నిర్వహణ మెరుగుపడి మరింత సౌకర్యవంతంగా మారుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సదాశివుడు మాట్లాడుతు ఆస్పత్రిలో సిబ్బంది బాధ్యతాయుత పనితీరుతో రోగులకు అత్యంత మెరుగైన సేవలు అందుతున్నాయని తెలిపారు. అలాగే ఇక్కడ కీమోథెరపీ, స్కానింగ్, వంటి సేవలు, బోన్ మ్యారో మార్పిడి వంటి అధునాతన చికిత్సలు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. అలాగే ఇక్కడ చికిత్స పొందుతున్న రోగుల సౌకర్యార్థం ఎన్నో స్వచ్ఛంద సంస్థలు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని, ఇప్పటికే ఇక్కడ మంచినీటి కోసం ఆర్వో ప్లాంటు ఏర్పాటుతో ఆస్పత్రిలోని అన్ని వార్డుల్లో నిర్విరామంగా నీటి సరఫరా అందుబాటులో ఉందన్నారు. కామధేను ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లల వార్డులో ఆవసరమయ్యే ఫర్నిచర్‌ను అందిచడం హర్షణీయమని ఫౌండేషన్ అధ్యక్షుడు పి. వెంకటేశ్ ను అభినందించి ధన్యవాదాలు తెలిపారు. కామధేను ఫౌండేషన్ అధ్యక్షులు పి. వెంకటేశ్ మాట్లాడుతు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజాసేవలో భాగంగా తాము చేపట్టే ప్రజోపయోగ కార్యక్రమాలు నిజమైన లబ్ధిదారులకు అందిన నాడే తమ సేవలకు సార్థకత చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కామధేను ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ అరవింద్, ప్రధాన కార్యదర్శి ఉమేష్, సత్యనారాయణ (ఆయిల్ పెడ్) పాథలోజీ విభాగం అధికారి డాక్టర్ రాధిక, డాక్టర్ శిల్పారెడ్డి, డాక్టర్ వెన్నెల, డాక్టర్ జానకీ రాం, డాక్టర్ ఖలీల్, చిల్వేరి నాగరాజు, లక్ష్మీనారాయణ, పద్మావతి, స్వప్న, నరేందర్ రెడ్డి, సత్యం, తదితరులు పాల్గొన్నారు

# 24 గంటల్లో ఆంజనేయస్వామి విగ్రహం అపహరణ కేసు ఛేదింపు

## తిరుపతి జిల్లా పోలీసులకు మంత్రి ఆనం అభినందనలు

## ఏఐ ఆధారిత ఐసీసీసీ, టీటీడీ విజిలెన్స్ సమన్వయంతో

## వేగవంతమైన దర్యాప్తు



అమరావతి(ప్రశ్న న్యూస్) తిరుమల డౌన్ ఘాట్‌రోడ్డులోని 7వ కిలోమీటర్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో జరిగిన విగ్రహం అపహరణ కేసును 24 గంటల్లోనే ఛేదించి, నిందితుడిని అదుపులోకి తీసుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్న తిరుపతి జిల్లా పోలీసులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అభినందించారు. ఘటన జరిగిన వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ దృశ్యాల సహాయంతో కేసును వేగంగా ఛేదించిన జిల్లా ఎస్పీ, దర్యాప్తు బృందాలు, టీటీడీ విజిలెన్స్ అధికారుల పనితీరును మంత్రి ప్రశంసించారు. ప్రాథమిక సమాచార సేకరణలో టీటీడీ విజిలెన్స్ కీలక పాత్ర పోషించిందని, నిందితుడి కదలికలు, ప్రయాణ వివరాలు, ఫోన్ నంబర్ వంటి కీలక సమాచారాన్ని సాంకేతికంగా గుర్తించి వెంటనే పోలీసులకు అందించడంతో దర్యాప్తు వేగవంతమైందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపుతో ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా లభించిన సాంకేతిక ఆధారాలు కూడా కేసు ఛేదింపులో కీలకంగా ఉపయోగపడ్డాయని మంత్రి పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించడం వల్లే తక్కువ సమయంలో కేసును పరిష్కరించడం సాధ్యమైందన్నారు. రాష్ట్రంలోని ఏ ఆలయంలోనైనా దేవతా విగ్రహాలపై దుశ్చర్యలకు పాల్పడితే ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించదని, చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ఎప్పటికప్పుడు సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడం వల్లే కేసు వేగంగా ఛేదించగలిగామని పేర్కొన్నారు. తిరుమలతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాలు, ఉపాలయాలు, ఘాట్‌రోడ్లు, పరిసర ప్రాంతాల్లో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, నిఘా వ్యవస్థను అత్యాధునిక సాంకేతికతతో విస్తరించాలని సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. భక్తులు అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ‘ది ఈస్ట్ ప్యాలెస్’ సిరీస్ రివ్యూ!

కొరియన్ సినిమాలకు .. సిరీస్ లకు ఓటీటీ ప్లాట్ ఫామ్స్ వైపు నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోంది. కొరియన్ కథల్లోని బలం .. సహజత్వం .. టేకింగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అందువలన ఓటీటీ సెంటర్లలో కొరియన్ కంటెంట్ హవా నడుస్తోంది. అలా వచ్చిన సిరీస్ గా ‘ది ఈస్ట్ ప్యాలెస్’ కనిపిస్తోంది. నామ్ జూ హ్యూక్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ డార్క్ ఫాంటసీ సిరీస్ ను 8 ఎపిసోడ్స్ గా రూపొందించారు. ఈ నెల 17వ తేదీ నుంచి ‘నెట్ ఫ్లిక్స్’లో తెలుగులోను స్ట్రీమింగ్ అవుతోంది. అది ఒక అందమైన ప్యాలెస్. అక్కడ నుంచే ప్రిన్స్ ‘క్రౌన్’ తన పరిపాలన కొనసాగిస్తూ ఉంటాడు. అతనికంటే ముందున్న రాజుకి నలుగురు వారసులు ఉంటారు. వాళ్లంతా కూడా ఒకరి తరువాత ఒకరు చనిపోతారు. ఆ మరణాలు జరిగిన 30 ఏళ్ల తరువాత ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి పునరావృతమవుతూ ఉంటుంది. క్రౌన్ వారసులు ముగ్గురు చనిపోతారు. నాల్గొవ కుమారుడు (యువరాజు) చావు బ్రతుకుల్లో ఉంటాడు. ఈ వరుస మరణాలకు కారణం ‘కోనేటి దెయ్యం’ అనే అంతా నమ్ముతుంటారు. ‘గు – చోన్’ ( నామ్ జూ హ్యూక్)కి చిన్నతనం నుంచే కొన్ని అతీంద్రియ శక్తులు వస్తాయి. అందువలన అతనికి దుష్టశక్తులను ఎదుర్కొనగలిగే శక్తి వస్తుంది. ఈ కారణంగా ‘క్రౌన్’ అతనిని పిలిపిస్తాడు. కోనేటి దెయ్యాన్ని అంతం చేసి, తన కొడుకుని బ్రతికిస్తే, అతను కోరినది ఇస్తానని చెబుతాడు. అసలు విషయాన్ని దాచేసి, ‘వాస్తు నిపుణుడు’గా తన ప్యాలెస్ లో చెలామణి కావలసిందిగా ఆదేశిస్తాడు. ప్యాలెస్ కి దూరంగా పెరిగిన కూతురు (యువరాణి)ని పిలిచి, ‘గు –చోన్’కి సహకరిస్తున్నట్టుగా ఉంటూ, అతనిని గమనించమని చెబుతాడు. యువరాణి .. గు – చోన్ ఇద్దరూ కూడా ఆ ప్యాలెస్ లో తిరుగుతూ, పరిస్థితులను పరిశీలించడం మొదలుపెడతారు. ఆ ప్యాలెస్ లో ‘కోనేరు’ చుట్టూ ఏదో రహస్యం ఉందని భావిస్తారు. అలాగే ‘ఉప్పుగని’ ప్రదేశంలోనే ప్రేతాత్మల హడావిడి ఎక్కువగా ఉండటాన్ని గమనిస్తారు. మంత్రించిన కుండల వెనుక మర్మం ఏదో ఉందని భావిస్తారు. యువరాజు




ప్రాణాలకు హాని తలపెడుతున్న పిశాచిని గురించి కనుక్కోవడానికి ‘గు–చోన్’ ప్రయత్నిస్తూ ఉంటాడు. ఆ రాజభవనంలో తన తల్లిని హత్యచేసింది ఎవరనే అన్వేషణను యువరాణి కొనసాగిస్తూ ఉంటుంది. ఆ రాజభవనంలోని రహస్యాలను తెలుసుకోవడానికి ప్రయత్నించిన వాళ్లు ప్రాణాలతో ఉండరనే ఒక ప్రచారం ఆ రాజ్యంలో బలంగా వినిపిస్తూ ఉంటుంది. అందువలన తాను వచ్చిన పనిని పూర్తి చేసి త్వరగా బయటపడాలనే ఉద్దేశంతో ‘గు – చోన్’ ఉంటాడు. తాను వచ్చిన పని అయ్యేంతవరకూ రాజభవనంలోనే ఉండాలనే ఆలోచనతో యువరాణి ఉంటుంది. వాళ్ల ప్రయత్నాలకు రాజమాత అడ్డుపడుతూ ఉంటుంది. వాళ్ల అన్వేషణలో తేలే నిజాలేమిటి? పిశాచిగా మారిన రాజనర్తకి ఎవరు? ఆ రాజభవనంలోని తూర్పు ప్రదేశంలో దాగిన రహస్యాలేమిటి? అనేది కథ.రాజభవనంలో వరుసగా జరుగుతున్న వారసుల మరణాలు, చనిపోయిన రాజనర్తకి అందుకు కారణమంటూ అసహనాన్ని ప్రదర్శించే రాజమాత, రాజావారి ఆదేశంతో ఆ పిశాచాన్ని అంతం చేయడం కోసం బరిలోకి దిగిన కథానాయకుడు, అతని పనితీరును పరిశీలించడం కోసం నియమితమైన యువరాణి. రాచకుటుంబంతో గల గొడవల కారణంగా ప్యాలెస్ కి దూరంగా పెరిగిన పాత్ర ఇది. ప్రధానమైన కథ అంతా కూడా ఈ నాలుగు ప్రధానమైన పాత్రల చుట్టూనే తిరుగుతూ ఉంటుంది.రాజులు .. రాజ్యాలు .. రాజభవనాలు అనగానే, అధికారం కోసం వారసత్వ పోరాటాలు జరగడం మామూలే. ఇక రాజభవనంలో పెత్తనం కోసం పోటీలు పడటం సహజమే. రాజభవనంలో ఏం జరుగుతుందనేది బయటికి తెలియకుండా సేవకులను భయపెట్టడం మామూలే. ఈ నేపథ్యంలో వాళ్లు క్షుద్ర విద్యలను తెలిసినవాళ్లను నమ్మడం కూడా సహజంగానే జరిగిపోతూ ఉంటుంది. ఈ అంశాలన్నిటినీ కలుపుకుంటూ సాగిపోయే ఈ కథ, ఇటు హారర్ టచ్ ను .. అటు ఫాంటసీ టచ్ ను ఇస్తూ .. జానపద కథను తలపిస్తుంది.రాజభవనం చుట్టూ అల్లుకున్న రహస్యాలను ఛేదించడం అనే అంశమే అందరిలో చాలా ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఇక ఆ అంశం క్షుద్ర శక్తులతో ముడిపడి ఉంటే .. అతీంద్రియ శక్తులతో వాటిని ఎదుర్కోవడం వంటి సన్నివేశాలు ఉంటే ఆడియన్స్ మరింత ఎంజాయ్ చేస్తారు. అలా ఈ కంటెంట్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. నైట్ ఎఫెక్టులు .. గ్రాఫిక్స్ .. విజువల్స్ .. సెట్స్ .. ఈ సిరీస్ ను నెక్స్ట్ లెవెల్లో మన కళ్లముందు నిలబెడతాయి. ఒక సాధారణ యువకుడు .. యువరాణి అనే విషయం తెలియక ఆమెతో కలిసి రహస్యాలను ఛేదించడం థ్రిల్ కలిగిస్తుంది. కథలో ట్విస్టులపై ట్విస్టులు ఉంటాయి. ఒకానొక దశలో నాల్గో ఎపిసోడ్ కి కథ అయిపోయిందేమో .. ఆ తరువాత ఇంకా ఏం చూపిస్తారబ్బా అనిపిస్తుంది. కానీ అక్కడి నుంచి కథ మరో అనూహ్యమైన మలుపు తీసుకుంటుంది. ఇలా ఈ కథ అంతఃపురం మొదలు ప్రేతాత్మలతో యుద్ధం వరకూ వెళుతుంది.కథ .. స్క్రీన్ ప్లే చాలా ఆసక్తికరంగా సాగుతాయి. మేకింగ్ చాలా స్టైలిష్ గా అనిపిస్తుంది. ఫొటోగ్రఫీ – నేపథ్యసంగీతం ఎక్కువ మార్కులు సంపాదించుకుంటాయి. ఎడిటింగ్ విషయానికి వస్తే కొన్ని సన్నివేశాలను ట్రిమ్ చేసుకోవచ్చు. గ్రాఫిక్స్ ను గట్టిగానే ఉపయోగించారు. పిశాచాలతో పోరాటం వంటి సన్నివేశాలు కాస్త ఇబ్బంది పెట్టినా, మిగతా సన్నివేశాలు ఆసక్తికరంగానే సాగుతాయి. సాధారణంగా జానపద కథలకు ఫాంటసీ టచ్ ఇవ్వడం జరుగుతూనే ఉంటుంది. ఈ సిరీస్ లో హారర్ టచ్ కూడా ఇవ్వడం కొత్తగా అనిపిస్తుంది.

# సెంటిమెంట్‌కు బ్రేక్!



‘రంగస్థలం’ వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత రామ్‌చరణ్–సుకుమార్ కలయికలలో తెరకెక్కబోతున్న తాజా సినిమా అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ‘ఆర్‌సీ17’ వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమా సెప్టెంబర్‌లో లాంఛనంగా ప్రారంభం కానున్నట్లు సమాచారం. ‘పుష్ప’ ‘పుష్ప–2’ వంటి పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్స్ తర్వాత సుకుమార్ చేస్తున్న సినిమా ఇదే కావడంతో జాతీయ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌పై హైప్‌క్రియేట్ అయింది. ప్రస్తుతం హీరోయిన్‌ను ఖరారు చేసే పనిలో చిత్రబృందం ఉన్నట్లు తెలిసింది. కృతిసనన్, రుక్మిణి వసంత్‌లపై లుక్ టెస్ట్ కూడా చేసినట్లు వార్తలొచ్చాయి.విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ సినిమాలో రష్మిక మందన్న కథానాయికగా ఖరారయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. ‘పుష్ప’ ఫ్రాంఛైజీ చిత్రాలతో తనకు నేషనల్ లెవల్‌లో స్టార్‌డమ్‌ను తీసుకొచ్చిన దర్శకుడు సుకుమార్‌పై అభిమానంతో ఈ సినిమాలో భాగం అయ్యేందుకు రష్మిక మందన్న సుముఖంగా ఉందని చెబుతున్నారు. ఇదిలావుండగా కెరీర్ ఆరంభం నుంచి సుకుమార్ తన సినిమాల్లో కథానాయికల్ని రిపీట్ చేయలేదు. ఒకవేళ ‘ఆర్‌సీ17’లో రష్మిక మందన్న నాయికగా ఖరారైతే సుకుమార్ ఆ సెంటిమెంట్‌ను బ్రేక్ చేసినట్లేనని అభిమానులు అనుకుంటున్నారు.

## షూటింగ్ లొకేషన్‌లో కాలు జారి

# కిందపడ్డ బాలయ్య



నందమూరి బాలకృష్ణ ఈ వయస్సులోను కుర్ర హీరోలతో పోటీ పడి సినిమాలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం గోపిచంద్ మలినేని దర్శకత్వంలో సినిమా చేస్తుండగా, ఈ చిత్ర షూటింగ్ తాజాగా కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతుంది. అయితే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసరాలలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా, ఆయన అనుకోకుండా కాలు జారి కిందపడిపోయారు.దాంతో ఆయన మోకాలిక స్వల్ప గాయం అయింది. వెంటనే చిత్ర బృందం షూటింగ్ ఆపేసి బాలయ్యని సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్య బృందం ఇతర పరీక్షలు కూడా నిర్వహించారు. స్వల్ప గాయమే అయిందని, కంగారు పడాల్సిన పనిలేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే కొన్ని రోజుల పాటు బాలయ్య విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు సమాచారం. ఇక సినిమాల విషయానికి వస్తే.. గోపిచంద్ మలినేనితో పాటు కొరటాల దర్శకత్వంలోను బాలయ్య ఓ చిత్రం చేస్తున్నాడు. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యువసుధ ఆర్ట్స్, ఎస్ఎల్‌వీ సినిమాస్ సంస్థలు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలకృష్ణ ఈ సినిమాలో గత చిత్రాలకు భిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని, మాఫియా బ్యాక్‌డ్రాప్‌తో కూడిన మాస్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతుందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వచ్చే ఏడాది సమ్మర్‌లో సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. బాలకృష్ణ–కొరటాల శివ కాంబినేషన్‌పై అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి ఉంది. గతంలో బాలయ్య కెరీర్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన ‘సింహా’ చిత్రానికి కొరటాల శివ రచనా సహకారం అందించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా డైలాగ్‌లు, మాస్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు దర్శకుడిగా కొరటాల, బాలయ్యతో సినిమా చేస్తుండటంతో అదే స్థాయి మాస్ ట్రీట్ మరోసారి దక్కుతుందనే అంచనాలు అభిమానుల్లో ఉన్నాయి.బాలకృష్ణ కెరీర్‌లో ‘సమరసింహా రెడ్డి’, ‘నరసింహ నాయుడు’, ‘సింహా’, ‘వీరసింహారెడ్డి’ వంటి ఫ్యాక్షన్ నేపథ్యంలో వచ్చిన చిత్రాలు ఘన విజయాలు సాధించాయి. అందుకే చీదీఖ112 కూడా అదే తరహా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటే బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## నాకు ఎలాంటి ఆపరేషన్ జరగలేదు, ఆరోగ్యంగానే ఉన్నా.. అమితాబ్ బచ్చన్ క్లారిటీ



బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఇటీవల చేసిన సోషల్ మీడియా పోస్ట్ దేశవ్యాప్తంగా ఆందోళనకు గురిచేసిన సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స, ఐసీయూ, కోలుకునే ప్రక్రియ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలతో అమితాబ్‌కు సర్జరీ జరిగిందని అభిమానులు భావించారు. అయితే ఈ ప్రచారాలపై తాజాగా ఆయన స్వయంగా స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. బిగ్ బీ మంగళవారం తన బ్లాగ్‌లో శస్త్రచికిత్స అనంతరం కోలుకోవడం ఎంత కష్టమో వివరిస్తూ ఓ పోస్ట్ చేశారు. దీంతో ఆయన ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందారని, సర్జరీ చేయించుకున్నారని వార్తలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆ పోస్టు వెనుక అసలు ఉద్దేశాన్ని అమితాబ్ వివరించారు. నాకు ఎలాంటి శస్త్రచికిత్స జరగలేదు. నేను పూర్తిగా ఆరోగ్యంగానే ఉన్నాను. నా పోస్ట్‌ను చాలా మంది తప్పుగా అర్థం చేసుకున్నారు అని ఆయన స్పష్టం చేశారు. శస్త్రచికిత్స తర్వాత ఐసీయూ నుంచి ఇంటికి వచ్చిన వ్యక్తి ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితులను కేవలం ఒక ఉదాహరణగా మాత్రమే ప్రస్తావించానని చెప్పారు. ఇటీవల జరిగిన అర్జెంటీనా––స్పెయిన్ ఫిఫా మ్యాచ్‌ను ఉద్దేశించే ఆ వ్యాఖ్యలు చేశానని అమితాబ్ వెల్లడించారు. ఒక ఛాంపియన్ ఓడిపోయిన తర్వాత తిరిగి నిలబడటం ఎంత కష్టమో చెప్పాలనుకున్నాను. ఫిఫా ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో అర్జెంటీనా ఓడిన తర్వాత మెస్సి పరిస్థితిని ఊహించుకుని ఆ పోస్ట్ రాశాను. కానీ, అది నా ఆరోగ్యానికి సంబంధించినదిగా అందరూ భావించారు అని వివరించారు. అమితాబ్ ఇచ్చిన ఈ వివరణతో అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఆరోగ్యంపై వ్యక్తమైన సందేహాలకు పూర్తిగా తెరపడింది. అంతేకాదు, తాను ప్రస్తుతం మంచి ఆరోగ్యంతో ఉన్నానని, త్వరలోనే ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న ‘కల్కి’ సీక్వెల్ షూటింగ్‌లో కూడా పాల్గొననున్నట్లు అమితాబ్ వెల్లడించారు. దీంతో బాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు అమితాబ్ ఆరోగ్యంగా ఉన్నారని తెలిసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 83 ఏళ్ల వయసులోనూ వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆయన మరోసారి తన ఫిట్‌నెస్, పనిపట్ల అంకితభావాన్ని చాటుకున్నారని అభిమానులు ప్రశంసిస్తున్నారు.

## నటి నుంచి వ్యాపారవేత్తగా

# సాక్షి అగర్వాల్

### – పుట్టినరోజునే కొత్త కంపెనీ ప్రారంభం..!



దక్షిణాది సినీ నటి సాక్షి అగర్వాల్ తన జీవితంలో మరో కీలక అడుగు వేశారు. నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ఇప్పుడు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి తన చిరకాల కలను నిజం చేసుకున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా ‘ఓకూ (రాఖఖ)’ పేరుతో ప్రీమియం పెర్ఫార్మెన్స్ న్యూట్రిషన్ కంపెనీని అధికారికంగా ప్రారంభించారు. కొత్త సంస్థ ప్రారంభం సందర్భంగా సాక్షి అగర్వాల్ భావోద్వేగంగా స్పందించారు. ఈ ప్రాజెక్ట్ కోసం తాను గత ఐదేళ్లుగా నిరంతరం పరిశోధనలు నిర్వహిస్తూ, ఉత్పత్తుల నాణ్యత, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ప్రజల అంచనాలకు తగ్గట్టుగా అత్యుత్తమ నాణ్యత కలిగిన పోషకాహార ఉత్పత్తులను రూపొందించడమే నా లక్ష్యం. ప్రతి ఉత్పత్తి విషయంలో నాణ్యతకు ఎలాంటి రాజీ పడకుండా ఎంతో శ్రద్ధతో పనిచేశాను అని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్లో అనేక న్యూట్రిషన్ ఉత్పత్తులకు సినీ ప్రముఖులు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్నారని, అయితే తాను ప్రారంభించిన సంస్థకు తానే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం ఎంతో గర్వంగా ఉందని సాక్షి తెలిపారు. సినిమా షూటింగ్‌లతో పాటు ఫిట్‌నెస్‌పై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తూ ఈ సంస్థను నిర్మించానని, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే నాణ్యమైన ఉత్పత్తులను ప్రజలకు అందించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ఎన్నో సంవత్సరాలుగా నేను కలగన్న స్వప్నం నేడు సాకారమైంది. ప్రజలకు నమ్మకమైన, నాణ్యమైన పోషకాహార ఉత్పత్తులను అందించే సంస్థగా ‘ఓకూ’ను తీర్చిదిద్దాలనుకుంటున్నాను. ఈ ప్రయాణంలో నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు” అని సాక్షి అగర్వాల్ వెల్లడించారు. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన సాక్షి అగర్వాల్.. ఆ తర్వాత తమిళ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ‘రాజా రాణి’, ‘కాలా’, ‘విశ్వాసం’, ‘సిండ్రెల్లా’, ‘టెడ్డి’, ‘అరణ్మనై 3’, ‘ది నైట్’ వంటి పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. అలాగే ‘బిగ్‌బాస్ తమిళ్’ రియాలిటీ షోలో పాల్గొని మరింత ప్రజాదరణ పొందారు. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న సాక్షి.. ఇప్పుడు వ్యాపారవేత్తగా కూడా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించడం విశేషం. సినీ కెరీర్‌తో పాటు వ్యాపార రంగంలోనూ విజ

## ‘జన నాయగన్’ పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసిన డైరెక్టర్.. విజయ్ 5 సార్లు చూసిన తొలి సినిమా ఇదేనట!



దళపతి విజయ్ చివరి చిత్రంగా రూపొందిన ‘జన నాయగన్’ విడుదలకు సిద్ధమవుతోంది. రాజకీయ, యాక్షన్ అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రం జూలై 23న తమిళంతో పాటు తెలుగు (‘జన నాయకుడు’), హిందీ (‘జన్ నేత’) భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా తెలుగు బ్లాక్‌బస్టర్ ‘భగవంత్ కేసరి’ కి రీమేక్ అనే ప్రచారంపై దర్శకుడు హెచ్. వినోత్ స్పందించారు. తాజా ఇంటర్వ్యూలో మాట్లాడిన హెచ్. వినోత్.. ‘జన నాయగన్’ పూర్తిస్థాయి రీమేక్ కాదని స్పష్టం చేశారు. “ఈ సినిమాలో కొన్ని భావోద్వేగ అంశాలు, మహిళా సాధికారతకు సంబంధించిన కాన్సెప్ట్ మాత్రమే ‘భగవంత్ కేసరి’ నుంచి ప్రేరణ పొందాయి. మొదటి భాగంలో కొంత పోలిక కనిపించినా, రెండో భాగం పూర్తిగా భిన్నంగా ఉంటుంది” అని తెలిపారు.‘నేర్కొండ పార్వై’ తర్వాత మరోసారి రీమేక్ చేయాలనే ఉద్దేశం తనకు లేదని వినోత్ వెల్లడించారు. అయితే విజయ్ స్వయంగా ‘భగవంత్ కేసరి’ చిత్రాన్ని 5 సార్లు వీక్షించి, అందులోని మహిళా సాధికారత అంశం తనకు బాగా నచ్చిందని చెప్పడంతో, అదే భావాన్ని కొత్త కథలో భాగంగా తీసుకున్నట్లు వివరించారు. తమిళ ప్రేక్షకుల అభిరుచికి, విజయ్ ఇమేజ్‌కు అనుగుణంగా కథను పూర్తిగా కొత్తగా మలిచామని చెప్పారు. ‘భగవంత్ కేసరి’లో బాలకృష్ణ పాత్ర శ్రీలీలను ధైర్యవంతురాలిగా తీర్చిదిద్దే నేపథ్యం ఉంటే.. ‘జన నాయగన్’లో విజయ్, మమితా బైజూ పాత్రల మధ్య కూడా అలాంటి భావోద్వేగ బంధాన్ని కొత్త కోణంలో చూపించనున్నట్లు తెలుస్తోంది. అయితే మిగతా కథ, పాత్రల రూపకల్పన పూర్తిగా భిన్నంగా ఉంటుందని చిత్రబృందం చెబుతోంది.

## రేషన్ ఆగొద్దంటే జులై 31లోగా
# ఈ-కేవైసీ తప్పనిసరి

**చేయనివారి పేర్లు తొలగింపు: కలెక్టర్ హేమంత్ హెచ్చరిక**



ములుగు(ప్రశ్నన్యూస్) ములుగు జిల్లాలో ఎన్ఎఫ్ఎస్ఎ.ఎఫ్ఎస్సి రేషన్ కార్డు లబ్ధిదారులందరూ జులై 31, 2026లోగా ఈ-కేవైసీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. కార్డులో పేరున్న ప్రతి సభ్యుడు ఆధార్, రేషన్ కార్డు ఒరిజినల్స్‌తో సమీప రేషన్ షాపుకు వెళ్లి ఫూశీూ మిషన్‌పై వేలిముద్ర వేయాలి. ఈ ప్రక్రియకు ఎలాంటి రుసుము లేదు. గడువులోగా ఈ-కేవైసీ చేయనివారి యూనిట్ నుంచి పేర్లు తొలగించి, రాయితీ సరఫరా నిలిపివేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతినెలా అందే ఉచిత, రాయితీ సరుకులకు అంతరాయం లేకుండా ఉండేందుకు వెంటనే రేషన్ షాపులను సందర్శించాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు.

# 10 ఏళ్లుగా బ్యాంకు లేని మండలం.

**బికన్నాయిగూడెం రైతులకు 40 కి.మీ కష్టాలుబి**
**ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.**
**బ్యాంకు కోసం అల్లాడుతున్న కన్నాయిగూడెం ప్రజలు.**
**వెంటనే బ్యాంకు శాఖ కల్పించాలి.**
**లేకుంటే ఆందోళనలు తప్పవని బీజేపీ హెచ్చరిక**



కన్నాయిగూడెం(ప్రశ్న న్యూస్)మండల కేంద్రంలో బ్యాంకు సౌకర్యం లేకపోవడంతో 6 వేల మంది రైతులు, మహిళా సంఘాల సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా. జాడి రామరాజు నేత ఆరోపించారు.బుధవారం గుట్టెవుల గ్రామంలో జరిగిన బీజేపీ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షురాలు దుర్గం సమ్మక్క అధ్యక్షత వహించారు.2016లో కన్నాయిగూడెం మండలం ఏర్పడి 10 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క బ్యాంకు శాఖ కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. దీంతో చిన్న చిన్న పనుల కోసం కూడా ప్రజలు 40 కి.మీ దూరంలోని ఏటూరునాగారం వెళ్లాల్సి వస్తోందన్నారు. అక్కడ కూడా నెట్‌వర్క్ సమస్యలతో రెండు మూడు రోజులు తిరగాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు.1992లోనే కన్నాయిగూడెం పేరుతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ పనిచేసేదని, సౌకర్యాలు లేవన్న సాకుతో దాన్ని ఏటూరునాగారానికి మార్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం మండలంలోని రైతులు, మహిళా సంఘాల ఖాతాలు అన్నీ అదే బ్యాంకులో ఉన్నాయని తెలిపారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పీఎన్‌బీని తిరిగి తరలించాలని, లేదా కొత్తగా ఏదైనా బ్యాంకు శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని బలోపేతం చేస్తామని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పళ్ళ బుచ్చయ్య, మండల ఇంచార్జి లింగంపల్లి శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆకుల సత్యం, నాయకులు బొగ్గుల భాస్కర్, పానుగంటి సంగీత, ఆకుతోట మధుకర్, ఆలం రాంబాబు, ఆకుతోట దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నామమాత్ర విలీనం వద్దు..
# ప్రభుత్వ ఉద్యోగుల హోదా కావాలి

**- ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం**
**- తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వద్ధామ రెడ్డి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) ఆర్టీసీ కార్మికులను కేవలం నామమాత్రంగా ప్రభుత్వంలో విలీనం చేయడం కాకుండా, పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని హక్కులు, సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వద్ధామ రెడ్డి డిమాండ్ చేశారు. దశాబ్దం తర్వాత జరుగుతున్న ఆర్టీసీ యూనియన్ ఎన్నికలు కార్మికుల భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టమని పేర్కొన్నారు.గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ డిపోను సందర్శించిన ఆయన కార్మికులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కార్మిక సంక్షేమమే తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.రానున్న యూనియన్ ఎన్నికల్లో కార్మికుల హక్కుల కోసం పోరాడే నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ మజ్దూర్ యూనియన్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాజలింగం, నిరంజన్, రీజినల్ నాయకులు కేఎం రెడ్డి, శ్యాంసుందర్, జీవీ నర్సిములు, డిపో సలహాదారులు ఆర్‌పీ రెడ్డి, ఎ. నర్సిములు, డిపో అధ్యక్షుడు పీఆర్‌సీ రెడ్డి, కార్యదర్శి జక్కుల నర్సిములు, వర్కింగ్ ప్రెసిడెంట్ అంబదాస్, సహాయ కార్యదర్శులు వీఎస్ రెడ్డి, ఎంఎం రాణి, లేడీస్ రిప్రజెంటేటివ్ పీఎస్ రాణి, వైస్ ప్రెసిడెంట్లు ఎస్‌ఎం రెడ్డి, కృష్ణ, కవిత, భద్రప్ప, గ్యారేజ్ సెక్రటరీ ఎండీ గఫూర్, కోశాధికారి బీజే రెడ్డితో పాటు డిపో కార్మికులు మహేష్, భీమ్ రెడ్డి, కిషన్, శంకర్, ముత్యాలు, ఎంఎస్ గౌడ్, యాదయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహ ఘటనపై
# కఠిన చర్యలు తీసుకోవాలి

**- దోషులను వెంటనే గుర్తించి శిక్షించాలి**
**- తెలంగాణ తల్లి విగ్రహాన్ని యథాతథంగా పునర్నిర్మించాలి**
**- గజ్వేల్‌లో సంఘటన స్థలంలో పోలీసుల**
**పంచనామా బిఆర్ఎస్ నాయకుల డిమాండ్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )గజ్వేల్ పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహానికి జరిగిన నష్టం ఘటనపై దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు గురువారం సంఘటన స్థలంలో పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గంగిశెట్టి రవీందర్, ఎన్.సి. సంతోష్, స్వామి చారి సంఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసు అధికారులతో మాట్లాడారు.
అనంతరం మీడియాతో మాట్లాడిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎన్.సి. సంతోష్, తెలంగాణ తల్లి విగ్రహానికి జరిగిన నష్టం సాధారణ ఘటనగా చూడరాదని అన్నారు. ఈ ఘటనలో ఎలాంటి నేరపూరిత కోణం ఉన్నా, నిర్లక్ష్యం వహించిన వారైనా చట్టం ముందు నిలబెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరినట్లు తెలిపారు.తెలంగాణ తల్లి ప్రతిమ రాష్ట్ర ఆత్మగౌరవానికి, కోట్లాది తెలంగాణ ప్రజల ఉద్యమ చరిత్రకు, త్యాగాలకు ప్రతీక అని పేర్కొన్న ఆయన, దెబ్బతిన్న విగ్రహాన్ని గతంలో ఉన్న రూపంలోనే అత్యంత నాణ్యతతో పునర్నిర్మించి, పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఈ విషయాన్ని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పునర్నిర్మాణం పూర్తైన వెంటనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహాన్ని గజ్వేల్ ప్రజలకు గౌరవప్రదంగా పునరంకితం చేయాలని విజ్ఞప్తి చేశారు."తెలంగాణ తల్లి విగ్రహం కేవలం ఒక ప్రతిమ కాదు... తెలంగాణ ఆత్మగౌరవానికి, ఉద్యమ స్ఫూర్తికి చిరస్మరణీయ చిహ్నం. అలాంటి ప్రతిమకు జరిగిన నష్టం బాధాకరం. దోషులను ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించి, విగ్రహాన్ని యథాతథంగా పునరుద్ధరించాలి" అని ఎన్.సి. సంతోష్ స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులకు విద్యార్థుల భవిష్యత్తు కన్నా రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం

**బీజేపీ సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర విద్యా శాఖమంత్రి మే నెల 12 న సీబీఐ కి ఫిర్యాదు చేశారు. మే నెల 15 న సీబీఐ దర్యాప్తు లో భాగంగా 13 మందిని అరెస్టు కూడా చేసింది. అలాగే కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించిన పరీక్ష పేపర్ లీకేజ్ కేసులో నాన్ బెయిలబుల్ అరెస్ట్ ఉండేలా చట్టం కూడా తీసుకొచ్చింది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యత వహించి మళ్లీ పరీక్షలు పెడతామని ప్రకటించారు. అదే సమయంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం లో పనిచేసిన ఒక ఉన్నతాధికారి సుప్రీం కోర్టులో మళ్లీ నీట్ పరీక్షలు నిర్వహించొద్దని పిల్ దాఖలు చేశారు కానీ కోర్టు తిరస్కరించడం గమనార్హం. జూన్ నెలలో 21 న మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించడం జరిగింది. అలాగే జూలై నెల 16 వ తేదీన నీట్ ఫలితాలను కూడా విడుదల చేశారు. విద్యార్థులు సంబురాలు కూడా చేసుకున్నారు. అయితే కాక్రోచ్ ముసుగులో కాంగ్రెస్ నాయకులు వెనకుండి జూలై 28 న అభిజిత్ తో దీక్ష ప్రారంభించారు. అది దీక్ష పేరుతో దేశ సార్వభౌమత్వాన్నే కించ పరిచారు. విద్యార్థుల లేని ఉద్యమం అని సోషల్ మీడియాలో ప్రచారం చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఛీత్కరిస్తున్నారు. నీట్ పరీక్ష గురించి కనీస అవగాహన లేని మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు బీజేపీ పార్టీ ని విమర్శించడం సిగ్గు చేటు అన్నారు.ఈ సమావేశంలో మేడ్చల్ బీజేపీ సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ మరియూ రామన్నగారి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం వైసీపీ మానుకోవాలి: బుచ్చి రాంప్రసాద్



మంగళగిరి(ప్రశ్న న్యూస్) వైసీపీ నాయకులు ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు తప్పుడు ప్రచారాలు, వివాదాలను సృష్టిస్తున్నారని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ఆరోపించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ నేత కరుణాకర్ రెడ్డికి సంబంధించిన భూదందాలు, అక్రమాలపై వరుసగా ఆరోపణలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కొత్త వివాదాలను తెరపైకి తీసుకొస్తున్నారని విమర్శించారు.స్వర్ణముఖి పరిసర ప్రాంతాల్లో భూముల వ్యవహారం, కపిలతీర్థం సెంటర్‌లోని ధ్యాన మందిరం ఆక్రమణ, అన్నమయ్య సెంటర్‌తో పాటు పీఏల పేర్లపై జరిగిన భూముల లావాదేవీలు, ఎండోమెంట్స్ శాఖ ఆస్తులకు సంబంధించిన వివాదాలు ప్రస్తుతం ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయని పేర్కొన్నారు. గంజాయి వ్యవహారాల నుంచి కుళ్లిన మాంసంతో బిర్యానీలు విక్రయించారనే ఆరోపణల వరకు అనేక అంశాలపై సమాధానం చెప్పకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.ఆంజనేయస్వామి విగ్రహం చోరీ ఘటనలో కూటమి ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించిందని బుచ్చి రాంప్రసాద్ తెలిపారు. కేవలం 14 గంటల్లోనే నిందితుడిని గుర్తించి, విశాఖకు చెందిన వ్యక్తిని ఒంగోలులో అదుపులోకి తీసుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. భక్తుల మనోభావాలతో రాజకీయాలు చేయడం ఆపాలని బుచ్చి రాంప్రసాద్ కోరారు.

## జవహర్ నగర్ వైద్య అధికారిపై
# డి ఏం హెచ్ ఓ తీవ్ర ఆగ్రహం

**జవహర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ**
**కొన్ని రోజులుగా విధులకు**
**హాజరుకాని వైద్యాధికారికి మందలింపు**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీ సమయంలో వైద్యాధికారి డా. విజయ్ చంద్ర గత కొన్ని రోజులుగా విధులకు క్వాజరు కాకపోవడం, ప్రజలకు అందించాల్సిన సేవల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం పట్ల డీఎంహెచ్ఓ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డా. విజయ్ చంద్ర వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.అనంతరం క్షయవ్యాధి మొబైల్ ఎక్స్-రే యూనిట్ పనితీరును పరిశీలించి, సేవలు ప్రజలకు అందుతున్నాయా అనే విషయాన్ని సమీక్షించారు. ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేసి ఈ -ఔషధి పోర్టల్లో నమోదైన ఔషధ నిల్వలు, పంపిణీ వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించడంతో పాటు, మాన్యువల్ స్టాక్ రిజిస్టర్లతో సరిపోల్చి ధృవీకరించారు. గడువు ముగియబోతున్న ఔషధాల కోసం ప్రత్యేకంగా నియర్ ఎక్స్పైరీ డ్రగ్ కార్నర్ ఏర్పాటు చేసి, వాటి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఫార్మసీ అధికారికి ఆదేశాలు జారీ చేశారు.ప్రభుత్వ ఆరోగ్య సేవల్లో ప్రజల సంక్షేమమే అత్యున్నత ప్రాధాన్యం. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని గౌరవంగా, ఆప్యాయంగా ఆదరించి నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టడం అందరి కర్తవ్యం. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై ఎలాంటి ఆలోచన లేకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాము అని స్పష్టం చేశారు. అలాగే అందరూ విధి సమయాలను ఖచ్చితంగా పాటించాలని, నిర్ణీత యూనిఫామ్‌లో విధులకు హాజరుకావాలని, ఆసుపత్రి పరిశుభ్రతను కాపాడాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, ప్రభుత్వం నిర్దేశించిన అన్ని ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు., విధుల పట్ల నిర్లక్ష్యం లేదా ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను కఠినంగా పరిగణించి అవసరమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ స్పష్టం చేశారు.

# మేడ్చల్ సర్కిల్ కు అభివృద్ధి పనుల కోసం రూ. 9.58 కోట్లు

**మేడ్చల్ తో పాటు పూడూరు - కిష్టాపూర్,**
**-గుండ్ల పోచంపల్లి డివిజన్లకు కేటాయింపు**
**సీఎంసీలో విలీనం అయ్యాక మొదటిసారి నిధులు**
**మంజూరు ఆనందంలో పట్టణవాసులు**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మున్సిపాలిటీ నుండి సిఎంసిలోకి విలీనం అయ్యాక మొట్టమొదటిసారిగా అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరయ్యాయి. పలు అభివృద్ధి పనుల కోసం రూ. 9 కోట్ల 58 లక్షల నిధులు మంజూరయ్యాయని మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుదాంష్ తెలిపారు. మేడ్చల్ డివిజన్ తో పాటు పూడూరు- కిష్టాపూర్ డివిజన్, గుండ్ల పోచంపల్లి డివిజన్ల అభివృద్ధి కోసం ఈ నిధులను కేటాయించనున్నారు. మూత్రశాలలు, సీసీ రోడ్ల నిర్మాణాలు, బోర్ వెల్స్ మరమ్మత్తులు బోనాల పండుగ ల కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నారని డిప్యూటీ కమిషనర్ సుదాంష్ తెలిపారు పూడూరు- కిష్టాపూర్ డివిజన్ కు రూ. 3 కోట్ల 80 లక్షలు, మేడ్చల్ డివిజన్ కు రూ.3 కోట్ల 48 లక్షలు గుండ్ల పోచంపల్లికి రూ. 2 కోట్ల 27 లక్షలు మంజూరయ్యాయి.

### విలీనం అయ్యాక మొదటిసారి నిధులు మంజూరు

మున్సిపాలిటీ గా ఉండి సీఎంసీలో విలీనమయ్యాక మొదటిసారి మంజూరు కావడంపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిఎంసి లో విలీనం అయ్యాక చిన్నాచితక పనులు కూడా కాకపోవడంతో నగరవాసులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. కనీసం డ్రైనేజీల సమస్య కూడా పరిష్కారం కావడం లేదని, మున్సిపాలిటీ గా ఉన్నప్పుడే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేటివి అని సిఎంసి లో విలీనమయ్యాక సమస్యలను గాలికి వదిలేశారని నగరవాసులు గగ్గోలు పెట్టారు. నగరంలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయని, డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతూ దుర్వాసన వస్తుందని ఈ సమస్యలను సీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోవడంతో సిఎంసి లోకి ఎందుకు వెళ్లిన మయ్యామా అంటూ బాధపడ్డారు.

### నిధుల మంజూరుతో తీరనున్న కష్టాలు

ఇంతకాలం సమస్యలతో సతమతమైన మేడ్చల్ వాసులు నిధులు మంజూరు కావడంతో నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు మూత్రశాలల నిర్మాణం, సీసీ రోడ్ల ఏర్పాటు, బోర్లకు మరమ్మత్తులు బోనాల పండుగ కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్న దృష్ట్యా సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. ముఖ్యంగా గత కొంతకాలంగా అస్తవ్యస్తంగా ఉన్న హౌసింగ్ బోర్డ్ కాలనీ రోడ్డు వేయడానికి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఈ రోడ్డు వేసేందుకు సీఎం సి అధికారులు సిద్ధమవుతున్నారు. గత కొంతకాలంగా ఈ రోడ్డు చినుకు పడితే చాలు బురద మయంగా మారడంతో స్థానిక ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఇటీవల ఈ రోడ్డుపై బిఆర్ఎస్ నేతలు వరి నాట్లు వేసి నిరసన సైతం తెలిపారు. ఈ రోడ్డు పరిస్థితి ఇది చూసి సిఎంసి అధికారులు సైతం ఇక్కడ సిసి రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలు పంపగా దీనికి అనుగుణంగా ప్రభుత్వం నుండి గ్రీన్ సిగ్నల్ రావడంతో సీసీ రోడ్డు నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. టెండర్ల ద్వారా ఈ రోడ్డు ను నిర్మించనున్నారు.

# నగరంలో కల్తీ పన్నీరు కలకలం

-జర్నలిస్టుల సమాచారంతో రంగంలోకి దిగిన ఎస్ఓటీ పోలీసులు
- సికింద్రాబాద్ పరిసరాలలో జోరుగా సాగుతున్న దందా
- పేరు, తయారీ వివరాలు లేని పన్నీరు స్వాధీనం
- తప్పుడు తేదీలతో పాత సరుకును కొత్తదిగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు
- వినియోగదారులను మోసం చేస్తున్న వ్యాపారులపై పోలీసుల చర్యలు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారులు
- నగరంలో ఉన్న సంతోష్ దాబాలకు విక్రయిస్తున్నట్లు సమాచారం
- కల్తీ ఆహార పదార్థాలపై కఠిన చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు
-ఆహార భద్రతా అధికారుల తనిఖీలు మరింత ముమ్మరం చేయాలనే డిమాండ్







సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ పన్నీరు వ్యాపారం అడ్డాలపై జర్నలిస్టుల సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు కొరడా ఝుళిపించారు. పికెట్ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన అనుమానాస్పద పన్నీరు నిల్వలపై జర్నలిస్టుల నుంచి అందిన సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ప్యాకెట్లపై తయారీదారులతోపాటు పూర్తిస్థాయిలో వివరాలు లేకుండా నిల్వ ఉంచిన పన్నీరు, అనుమానాస్పద లేబుళ్లు, తప్పుడు తేదీలతో విక్రయిస్తున్న సరుకును పోలీసులు గుర్తించినట్లు సమాచారం. చాలా వరకు ఎక్స్పైరీ అయిన ఆహార పదార్థాలను హోటళ్ల, దాబాల నిర్వహకులు తక్కువ రేటుకు కొనుగోలు చేసి వినియోగదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాల్సిన వ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కి, ఆరోగ్య ప్రమాణాలను పట్టించుకోకుండా పన్నీరు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా తయారీ తేదీ, గడువు తేదీ, తయారీదారు వివరాలు, బ్యాచ్ నంబర్ వంటి కీలక సమాచారం లేకుండానే పన్నీరు నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు.

### తప్పుడు తేదీలతో మోసం.?

పన్నీరు ప్యాకెట్లపై తప్పుడు తేదీలు ముద్రించి, పాత సరుకును కొత్తదిగా చూపిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారనే ఆరోపణలు దాడుల సందర్భంగా వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. అదే కాకుండా ఈ నకిలీ పన్నీర్, చీజ్ ను నగరంలో ఉన్న సంతోష్ వెజిటేబుల్ దాబాలలో విక్రయిస్తున్నట్లు సమాచారం. తక్కువ రేటుకు వస్తుందని సంతోష్ దాబాలలో కొనుగోలు చేసి వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే కాకుండా గడువు ముగిసిన లేదా నాణ్యతపై అనుమానం ఉన్న పన్నీరును కొత్త తేదీలతో మార్కెట్‌లోకి పంపుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### జర్నలిస్టుల సమాచారంతో కదిలిన పోలీసులు

ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న పన్నీరు వ్యాపారంపై జర్నలిస్టులు అందించిన సమాచారాన్ని సీరియస్‌గా తీసుకున్న ఎస్ఓటీ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. పికెట్ ప్రాంతంలోని పన్నీరు వ్యాపార కేంద్రంపై దాడులు నిర్వహించి, అక్కడ నిల్వ ఉన్న సరుకును క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో పేరు, తయారీ వివరాలు లేని పన్నీరు, చీజ్ ను గుర్తించడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.




### ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం

పాల ఉత్పత్తులు, ముఖ్యంగా పన్నీరు, నేరుగా ప్రజల ఆహారంలో భాగమవుతున్నాయి. అయితే కొందరు వ్యాపారులు లాభాల కోసం నాణ్యతా ప్రమాణాలను గాలికి వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిల్వ విధానం, ఉత్పత్తి తేదీ, గడువు తేదీ వంటి అంశాలను పట్టించుకోకుండా సరుకును విక్రయించడం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## మల్లన్న సన్నిదిలో హుండీల లెక్కింపు

హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి

రూ. 5,06,97,110 /-లు నగదు రాబడిగా లభించింది.



శ్రీశైలం (ప్రశ్నన్యూస్) శ్రీశైలం ఆలయంలో లెక్కింపు చేశారు. హుండీ రాబడిని భక్తులు గత 30 రోజులలో ( 22.06.2026 నుండి 21.07.2026 వరకు) సమర్పించడం జరిగింది. అలాగే ఈ హుండీలో 91 గ్రాముల 300 మిల్లీగ్రాముల బంగారు, 3 కేజీల 160 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా 1353 - యుఎస్ఏ డాలర్లు, 200-- యు.ఏ.ఇ దిర్హమ్స్, 4 - సింగపూర్ డాలర్లు, 120 -- ఇంగ్లాండు పౌండ్స్, 272 -- మలేషియా రింగిట్స్, 10 -- యూరోస్, 5 - కెనడా డాలర్లు, 50 -- సౌత్ ఆఫ్రికా రాండ్స్ మొదలైనవి ఈ హుండీల లెక్కింపులో లభించాయి.పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ హుండీల లెక్కింపును కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. హుండీల లెక్కింపులో ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీమతి కె. కాంతివర్ధిని, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఎస్. చంద్రశేఖర్ హుండీల లెక్కింపును పాల్గొన్నారు. అదేవిధంగా హుండీల లెక్కింపులో పలువిభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, దేవస్థానం సిబ్బంది శివసేవకులు పాల్గొన్నారు.

## ఓటమి ఫర్వాలేదు కానీ, మోసం చేయకూడదు

- నీట్ వివాదంపై సచిన్ టెండూల్కర్ స్పందన



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నీట్-యూజీ 2026 పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్న తరుణంలో, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ స్పందించాడు. కష్టపడి పనిచేసే తత్వానికి, నిజాయతీకి మరియు ప్రతిభకు సముచిత గుర్తింపు లభించే సంస్కృతిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చాడు. ఈ మేరకు గురువారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సందేశాన్ని పంచుకున్నాడు. ఈ సందర్భంగా తన తండ్రి, ప్రొఫెసర్ రమేశ్ టెండూల్కర్ నేర్పిన విలువైన పాఠాన్ని సచిన్ గుర్తుచేసుకున్నాడు. "పరాజయం పర్వాలేదు కానీ, మోసం మాత్రం చేయకూడదు. విజయం కోసం ఎప్పుడూ అడ్డదారులు తొక్కవద్దని మా నాన్న నాకు చెప్పేవారు. సమాజంలో పెద్దలుగా, మన సంస్కృతిని సరైన మార్గంలో తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని పేర్కొన్నాడు. కేవలం ఫలితాలకే ప్రాధాన్యమిచ్చే సమాజం, ప్రతిభ కంటే అక్రమ మార్గాలనే ఎక్కువగా ఆశ్రయిస్తుందని అభిప్రాయపడ్డాడు."తమ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కలేదని విద్యార్థులు నిరాశ చెందడం సహజం. భవిష్యత్తులో వారికి మళ్లీ ఇలాంటి చేదు అనుభవాలు ఎదురుకాకుండా మనమందరం సమష్టిగా కృషి చేయాలి" అని సచిన్ టెండూల్కర్ సూచించాడు. యువత ఆకాంక్షలను పరిరక్షించే దిశగా త్వరలోనే సరైన పరిష్కారాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశాడు. నీట్-యూజీ 2026 పరీక్ష పత్రాల లీకేజీతో పాటు పలు అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు నేపథ్యంలో, ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా దేశవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బాధితులకు పలువురు ప్రముఖులు తమ మద్దతును ప్రకటిస్తున్నారు.

# ఏజెన్సీలో మైక్రో ఫైనాన్స్ దోపిడీ

10 రూపాయల వడ్డీతో పేదల గొంతు కోస్తున్న ఆంధ్రా కంపెనీలు

అమాయకులను దోచుకుంటున్న పట్టించుకోని అధికారం యంత్రాంగం

కొంతమంది రాజకీయ నాయకుల కనుసైగల్లోనే వడ్డీ వ్యాపారం

అధికారులు మౌనం.. బీఆర్ఎస్ నేత ఎంపెల్లి రాజు ఆగ్రహం



ఏటూరునాగారం(ప్రశ్నన్యూస్) పేదరికమే పెట్టుబడిగా... ఆదుకుంటామనే పేరుతో అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. ములుగు జిల్లా ఏజెన్సీ మండలాల్లో కొన్ని ఆంధ్రా మైక్రో ఫైనాన్స్ సంస్థల తీరు ఇది. రోజువారీ కూలీలు, దళితులు, గిరిజనుల అత్యవసరాలను ఆసరాగా చేసుకుని రూ.100కు రూ.10 చొప్పున వడ్డీ వసూలు చేస్తూ కుటుంబాల నడ్డి విరుస్తున్నాయి. విషయం తెలిసి కూడా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ఈ దందా రోజురోజుకు విస్తరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏటూరునాగారం, వెంకటాపూర్, మంగపేట తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో పని కోసం పట్టణాలకు వెళ్లలేని కుటుంబాలు చిన్న చిన్న అవసరాలకు ఈ సంస్థలను ఆశ్రయిస్తున్నాయి. రూ.10 వేలు, రూ.15 వేల రుణాల కోసం వారానికి ఒకసారి వడ్డీ కట్టాలనే నిబంధనతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. కానీ లెక్కలు కట్టేసరికి అసలు కంటే వడ్డీనే ఎక్కువ అవుతోందని బాధితులు వాపోతున్నారు. గత ఏడాది కాలంగా ఈ ఫిర్యాదులు పెరుగుతున్నా జిల్లా యంత్రాంగం నుంచి ఎలాంటి చర్యలు లేకపోవడంతో సంస్థల ఆగడాలు మరింత పెరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### పేదల రక్తం పీలుస్తున్నారు ఎంపెల్లి రాజు.

ఏజెన్సీ ప్రాంతాలలో పేదల ఫైనాన్స్ దోపిడీపై బీఆర్ఎస్ నాయకుడు ఎంపెల్లి రాజు తీవ్రంగా స్పందించారు. గురువారం ఏటూరునాగారంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ -ఏజెన్సీలోని అమాయక గిరిజనులు, పేద మహిళలను టార్గెట్ చేసి కొన్ని ఆంధ్రా మైక్రో ఫైనాన్స్ కంపెనీలు దోపిడీ చేస్తున్నాయి. రూ.100కు రూ.10 వడ్డీ అంటే సంవత్సరానికి 120 శాతం అవుతుంది. ఇది దోపిడీ కాకపోతే మరేంటి? అధికారులు కళ్లు మూసుకుని కూర్చున్నారు. వాయిదా ఆలస్యమైతే ఇళ్లకు వెళ్లి మహిళలను బెదిరిస్తున్నారు, పరువులు తీస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ దందాపై సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా వసూలు చేస్తున్న వడ్డీలను రద్దు చేయాలి. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థల లైసెన్సులు రద్దు చేయాలి."- అని ఆయన డిమాండ్ చేశారు.

### వేధింపులు... ఆత్మహత్యల భయం.




రుణం తీసుకున్న వారు వాయిదా కట్టలేకపోతే ఫోన్లతో వేధించడం, అసభ్య పదాలతో దూషించడం, గ్రూపులోని ఇతర మహిళల ముందు అవమానించడం సర్వసాధారణం అయ్యిందని బాధితులు చెబుతున్నారు. పొద్దున్నే ఇంటికి వచ్చి పిల్లల ముందు అరుస్తారు. వడ్డీ కట్టమని ఒత్తిడి చేస్తారు. మాకు వేరే దారి లేదు కాబట్టి మళ్లీ అప్పు చేసి కడుతున్నాం" అని ఒక మహిళ కన్నీరు పెట్టుకుంది.

ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వడ్డీ భారం తట్టుకోలేక కుటుంబాలు వలస వెళ్తున్న ఘటనలు కూడా ఉన్నాయని గ్రామ పెద్దలు చెబుతున్నారు.

### ప్రభుత్వం ఏం చేస్తుంది.?

ఏజెన్సీ ప్రాంతాల్లో మైక్రో ఫైనాన్స్ సంస్థల కార్యకలాపాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిఘా పెట్టాలని, చట్టవిరుద్ధంగా అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వారిపై కలెక్టర్ ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, న్యాయం చేయాలని ఎంపెల్లి రాజు కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఏజెన్సీలో పేదలను ఆదుకోవాల్సిన వ్యవస్థలే వారిని దోపిడీ చేసే వారికి సహకరిస్తే ఇక వారి దిక్కు ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## గూగుల్‌కు భారీ జరిమానా

- డీఎంఏ నిబంధనల ఉల్లంఘన కింద

890 మిలియన్ యూరోల జరిమానా



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) టెక్ దిగ్గజం ఆల్ఫాబెట్ అనుబంధ సంస్థ గూగుల్‌కు యూరోపియన్ యూనియన్ (ఈయూ) భారీ షాక్ ఇచ్చింది. డిజిటల్ మార్కెట్స్ యాక్ట్ (డీఎంఏ) నిబంధనలను ఉల్లంఘించినందుకు ఏకంగా 890 మిలియన్ యూరోల (సుమారు రూ. 8,200 కోట్లకు పైగా) జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది. టెక్ కంపెనీల ఆధిపత్యాన్ని అరికట్టే లక్ష్యంతో తీసుకొచ్చిన ఈ నూతన చట్టం కింద గూగుల్‌పై చర్యలు తీసుకోవడం ఇదే తొలిసారి. ఈ జరిమానాను రెండు భాగాలుగా విభజించారు. గూగుల్ సెర్చ్ ఫలితాల్లో తమ సొంత సేవలైన షాపింగ్, హోటల్స్, విమాన టికెట్ల వంటి వాటికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, పోటీ సంస్థల సేవలను వెనక్కు నెట్టినందుకు 460 మిలియన్ యూరోలు విధించారు. అలాగే, గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్ డెవలపర్లు తమ వినియోగదారులను ఇతర ఆఫర్ల వైపు మళ్లించకుండా ఆంక్షలు విధించినందుకు మరో 430 మిలియన్ యూరోలు జరిమానా విధించినట్లు ఈయూ కమిషన్ స్పష్టం చేసింది. 2024లో దీనికి సంబంధించి విచారణ ప్రారంభం కాగా, తాజాగా ఈ తుది నిర్ణయాలు వెలువడ్డాయి.

గూగుల్ చర్యల వల్ల మార్కెట్‌లో పోటీతత్వం దెబ్బతింటోందని, ఇది వినియోగదారులకు నష్టం కలిగిస్తోందని ఈయూ అధికారులు పేర్కొన్నారు. "ఉత్తమమైన ఉత్పత్తులు వాటి నాణ్యత ఆధారంగా విజయం సాధించాలి తప్ప, అవి సెర్చ్ ఇంజిన్ యజమాని సొంతమైనవి అనే కారణంతో కాదు" అని ఈయూ కాంపిటిషన్ చీఫ్ థెరెసా రిబెరా వ్యాఖ్యానించారు. మరోవైపు, ఈయూ నిర్ణయంపై గూగుల్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నిబంధనల వల్ల వినియోగదారుల అనుభవం, భద్రతా ఫీచర్లు దెబ్బతింటాయని పేర్కొంది. ఈ తీర్పును సమీక్షిస్తున్నామని, అప్పీలుకు వెళ్లే అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలిపింది. కాగా, నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేసేందుకు గూగుల్‌కు 60 రోజుల గడువు ఇచ్చారు. లేనిపక్షంలో రోజువారీ ప్రపంచ టర్నోవర్‌లో 5 శాతం వరకు అదనపు జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# 20 ఏళ్లుగా అమెరికాలో ఉద్యోగం

- ఇంజినీర్‌పై తెలంగాణ ప్రభుత్వం విచారణ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రోడ్లు, భవనాల (ఆర్ అండ్ బి) శాఖలో పనిచేస్తున్న ఓ ఇంజనీర్, ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా దాదాపు రెండు దశాబ్దాలుగా అమెరికాలో ఉద్యోగం చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం, సదరు ఇంజినీర్‌పై క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించింది. శాఖాపరమైన రికార్డుల్లో ఇప్పటికీ ఉద్యోగిగా కొనసాగుతున్న ఆయనపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఆర్ అండ్ బి శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్న సీహెచ్ రవి, 2006లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో తొలిసారిగా అమెరికా వెళ్లారు. అనంతరం 2011లో స్వల్ప కాలం పాటు తిరిగి వచ్చి, 2012లో మళ్లీ అమెరికాకు వెళ్లారు. అప్పటి నుంచి ఆయన విధులకు హాజరుకావడం లేదు. గత కొన్ని ఏళ్లుగా ఆయన వేతనం తీసుకోనప్పటికీ, ఆర్ అండ్ బి శాఖ అధికారిక రికార్డుల్లో ఆయన పేరు ఇప్పటికీ ఉద్యోగిగా కొనసాగుతుండటం గమనార్హం.ప్రభుత్వ సర్వీస్ నిబంధనల ప్రకారం, విదేశాల్లో ఉద్యోగం చేయాలంటే ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. అలాగే, నిబంధనల మేరకు గరిష్ఠంగా ఐదేళ్ల వరకు మాత్రమే దీర్ఘకాలిక సెలవు పొందేందుకు అవకాశం ఉంటుంది. అయితే, రవి ఎలాంటి అనుమతులు పొందకుండానే విదేశాల్లో ఉద్యోగంలో చేరి సేవా నిబంధనలను ఉల్లంఘించారని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో, అనధికారిక గైర్హాజరు, సర్వీస్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై ప్రభుత్వం శాఖాపరమైన విచారణకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి రవి నుంచి ఇప్పటివరకు ఎలాంటి లిఖితపూర్వక వివరణ అందలేదని తెలుస్తోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588